PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 41 | విజయవాడ, బుధవారం 11 సెప్టెంబర్ 2024 | 8 + 8 పేజీలు : 5.50

Vol No | Vijayawada, Wednesday 11 September 2024 | Rs

బడా కంపెనీల నుంచి సెబీ చీఫ్‌కు భారీ ఆదాయం..!

- మహీంద్రా, డాక్టర్ రెడ్డీస్, ఐసిఐసిఐ బ్యాంక్‌లతో దోస్తీ
- మరో మూడు సంస్థలతోనూ..
- మాధబి కంపెనీకి కోట్ల రాబడి
- ఆమె భర్త దావల్‌కు సంపాదన
- కాంగ్రెస్ తీవ్ర విమర్శలు

3



8

పారా ఒలింపిక్స్‌పతక విజేతలకు ప్రోత్సాహకాలు

- నగదు చెక్కుల అందజేత
- కేంద్ర క్రీడలమంత్రి మాండవీయ

సీతారాం ఏచూరి ఆరోగ్య పరిస్థితి విషమం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోగ్య పరిస్థితి విషమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఏచూరి తీవ్రమైన శ్వాసకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్‌తో గత మూడు వారాలుగా న్యూఢిల్లీలోని ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో చికిత్స పొందుతున్నారు. వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణుల బృందం సంక్లిష్టంగా ఉన్న ఆయన ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నదని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యపరిస్థితి క్రిటికల్‌గానే ఉందని పార్టీ ఆ ప్రకటనలో తెలిపింది. ఆగస్టు 19న ఏచూరి ఎయిమ్స్‌లో చేరారు.



3 నెలల్లో కులగణన

- తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

బిసి కులగణన మూడు నెలల్లో పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కులగణన పూర్తి చేసి నివేదిక సమర్పించాలని పేర్కొంది. రాష్ట్రంలో బిసి కులగణన చేపట్టాలని బిసి సంఘం నేత ఎర్ర సత్యనారాయణ 2019లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. బిసి కులగణన చేపట్టాలని గతంలో సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని కోర్టు దృష్టికి పిటిషనర్ తీసుకొచ్చారు. బిసి కులగణనపై ప్రభుత్వం జాప్యం చేస్తోందని, దీనివల్ల ఆయా సామాజిక తరగతుల ప్రజలు అన్ని రంగాల్లో రాజ్యాంగ హక్కులు పూర్తి స్థాయిలో పొందలేకపోతు న్నారని పేర్కొన్నారు. బిసి కులగణన చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి... కోర్టుకు తెలిపారు. మరింత జాప్యం లేకుండా మూడు నెలల్లో దీనిని పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ పిటిషన్‌పై విచారణ ముగిసినట్లు ప్రకటించింది.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- రాష్ట్రానికి తక్షణ సాయంగా రూ.10 వేల కోట్లు
- కేంద్రంపై ఒత్తిడి చేయాలి
- ముఖ్యమంత్రికి సిపిఎం విజ్ఞప్తి
- వరద బాధిత కుటుంబానికి తక్షణ సాయం రు.25 వేలు
- నష్టం బట్టి పంటల వారీగా పరిహారం
- శాశ్వత చర్యలు తీసుకుంటామన్న సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విరుచుకుపడిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించేలా కేంద్రంలో ముఖ్య పాత్ర వహిస్తున్న టిడిపి కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సిపిఎం రాష్ట్ర ప్రతినిధి వర్గం కోరింది. ఈ మేరకు ముంపు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు తదితర అంశాలపై మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు, డి.రమాదేవి, కె.ప్రభాకరరెడ్డి ఉన్నారు. విజ్ఞాపన పత్రం అందచేసిన అనంతరం వై.వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ వరద బాధితులకు తక్షణమే పదివేల కోట్ల రూపాయల సాయం అందించాలని కోరారు. సింగ్‌నగర్ ప్రాంతంలో ప్రతి ఇంట్లో వస్తువుల రూపంలో లక్ష రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని వివరించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు మొత్తం పాడైపోయాయని తెలిపారు. బుడమేరు ముంపు రాకుండా ఉండేందుకు దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రైతాంగం నష్టపోయిందని, వ్యవసాయ కార్మికులు ఉపాధి లేదని, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నష్టతీవ్రతను బట్టి పంటలవారిగా పరిహారం అందించాలని కోరారు. సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ సహాయక చర్యలు క్షేత్రస్థాయికి చేరడం లేదని అన్నారు. వరద నష్టంపై అంచనాలు రూపొందించి, ఎంతమేరకు నష్టం జరిగిందో అంతమేరకు వారికి పూర్తి పరిహారం ఇవ్వాలని కోరారు. ముంపు నివారణలో ప్రభుత్వ వైఫల్యం ఉందన్నారు. వరద వస్తుందని తెలిసినా ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారయంత్రాంగం లోపం



సిఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

కొట్టొచ్చినట్లు కనపడుతోందని చెప్పారు. వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణానది ముంపు నుండి నగరాన్ని కాపాడేందుకు రిటైనింగ్ వాల్ కట్టాలని 1998లో సిపిఎం పక్షంగా తొలిసారి తామే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. అది ఇప్పటికీ కార్యరూపం దాల్చిందని చెప్పారు. బుడమేరు ముంపు నుండి కాపాడేందుకు వరద నీటిని మళ్లించడంతోపాటు శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా స్పందించి కొల్లేరు నుండి ముంపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు.. డి.రమాదేవి మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లో మహిళల అవస్థలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా డ్వాక్రా, పొదుపు సంఘాల రుణాలు చెల్లింపు వాయిదా వేయించేలా చూడాలని సిఎంను కోరినట్లు తెలిపారు.

అందరికీ సాయమందిస్తాం : సిఎం హామీ

బుడమేరు ముంపు నివారణకు సంబంధించి శాశ్వత చర్యలు తీసుకుంటామని, వరద సహాయ చర్యలు అందరికీ అందేలా చూస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిపిఎం ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. బృందం వివరించిన సమస్యలను పూర్తిగా ఆలకించారు. వరద సహాయానికి సంబంధించి కొన్ని అంశాలను అడిగి తెలుసుకున్నారు బుడమేరు ముంపునకు సంబంధించిన శాశ్వత పరిష్కారం దిశగా వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు సిపిఎం నాయకులు తెలిపారు.

(వినతిపత్రం పూర్తిపాఠం 4వ పేజీలో)

ప్రజలు, అధికారుల సహకారంతో విపత్తు ఎదుర్కొన్నాం

- 10 రోజుల తర్వాత ఉండవల్లి ఇంటికి చంద్రబాబు
- నేటి నుంచి ఉత్తరాంధ్ర పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజలు, అధికారుల సహకారంతో సమర్ధవంతంగా విపత్తును ఎదుర్కొన్నామని, ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడంతోపాటు అంతా నిలదొక్కుకునే విధంగా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల 6.5 లక్షల మంది ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. బుడమేరు గండ్లుపడిన ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వర్షాలు పడ్డాయని, ప్రకృతి కన్నెర్ర చేసిందని అన్నారు. కృష్ణా నదిలో రికార్డు స్థాయిలో 11.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు రావడం, డ్రెయిన్లు పొంగడం, అదే సమయంలో బుడమేరుకు పెద్ద ఎత్తున నీరు రావడం అన్నీ కలిసి ప్రజా జీవితాన్ని అతలాకుతలం చేశాయన్నారు. గత పాలకులు ఐదేళ్లలో వ్యవస్థలను చిన్నాభిన్నం చేసి భ్రష్టుపట్టించారన్నారు. బుడమేరు ఆక్రమణలకు గురైందని, అక్రమ కట్టడాలు కట్టారని, అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని సిఎం వెల్లడించారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ అధికారులు రేయింబవళ్లు కష్టపడి బుడమేరుకు పడిన గండ్లు పూడ్చారని, వారితో నారా లోకేష్ సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని పర్యవేక్షించారని తెలిపారు. వరద బాధితులను ఆదుకునేందుకు అనేక మంది దాతలు ముందుకొచ్చారన్నారు. వరద ప్రాంతాల్లో 10 రోజులు మంత్రులు, ఉన్నతాధికారులు, అధికారులు, పారిశుధ్య కార్మికులు పనిచేశారన్నారు. ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ టీమ్ తిరుగుతోందని, యాప్ ద్వారా డేటా సేకరించామని చెప్పారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, ఆర్మీ, నేవీ సాయంతో వరద సహాయక చర్యలు త్వరితగతిన చేపట్టామన్నారు. రాజకీయం ముసుగులో కొందరు నేరస్తులు ముసుగు వేసుకున్నారని, వారి ముసుగును తొలగిస్తామని చంద్రబాబునాయుడు అన్నారు. నేరస్తుల్ని ప్రజల ముందు నిలబెడతామని ఆయన హెచ్చరించారు. కృష్ణా నదిలో 11.20 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉన్న సమయంలో 3 బోట్లను వదిలి పెట్టి 170 ఏళ్ల చరిత్ర గల మిగతా2లో

పంట రుణాలు మాఫీ చేయండి

- ముఖ్యమంత్రికి రైతు సంఘాల సమన్వయ సమితి విజ్ఞప్తి

3

గ్రామాల్లో ఆపదమిత్ర బృందాలు ఏర్పాటు

- ప్రకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తత అవసరం
- రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత

3

అన్నార్తులకు అండగా కార్మిక, ప్రజా సంఘాలు

- వేలాదిమంది ఆకలితీరుస్తున్న ఆహార పంపిణీ కేంద్రాలు

2

గోదావరి మళ్లీ ఉగ్రరూపం



విఆర్ పురం మండలం శ్రీరామగిరిలో నిలిచిన వరదనీరు

- పోటెత్తిన 'శబరి'
- భద్రాచలం వద్ద 2వ, ధవళేశ్వరం వద్ద 1వ ప్రమాద హెచ్చరిక
- పోలవరం ముంపు మండలాల్లో రాకపోకలు బంద్
- పునరావాస కేంద్రాలకు బాధితులు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో మంగళవారం గోదావరి మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. శబరి నది ఒక్కసారిగా పోటెత్తింది. వాతావరణ శాఖ హెచ్చరించినట్లుగానే ఫ్లాష్ ఫ్లడ్స్ రావడంతో పోలవరం ముంపు మండలాల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పలుచోట్ల రోడ్లపై వరద నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. ఆయా గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. గత 24 గంటల్లో భద్రాచలం వద్ద దాదాపు 22 అడుగుల మేర వరద పెరిగింది. మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు 49.40 అడుగుల నీటిమట్టం చేరింది. ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గంటగంటకూ వరద వేగంగా పెరుగుతోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 12.30 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ 175 గేట్లను పైకిలేపి 10,57,512 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. సోమవారం రాత్రి 7.60 అడుగులు మాత్రమే ఇక్కడ నీటిమట్టం ఉండేది. 24 గంటల్లోనే 4.70 అడుగులకుపైగా వరద నీరు వచ్చి చేరింది. వరద మరింత పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.

చింతూరులోకి వరద నీరు

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని విఆర్.పురం, చింతూరు, కూనవరం, ఎటపాకల్లోని పలు గ్రామాలు ముంపులోకి వెళ్లాయి. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 44 అడుగులుగా నమోదైంది. చింతూరు మండల కేంద్రంలోని లారీ యూనియన్ కార్యాలయం, వినాయకుని గుడి, ప్రభుత్వ మద్యం దుకాణం, విఆర్.పురం రోడ్డులోని చేపల మార్కెట్, శబరి ఒడ్డు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. సోకిలేరు, చీకటివాగు పొంగడంతో మిగతా7లో



విశాఖలోని కూర్మన్నపాలెం కూడలిలో రాస్తారోకోలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు, ప్రజలు

బిగిసిన 'ఉక్కు' పిడికిలి

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు

విశాఖలో పలువురు అరెస్టు

కూర్మన్నపాలెం కూడలిలో ఆందోళన ఉద్రిక్తం

రాజమండ్రిలో పోలీసుల జులుం

వార్త 2లో..

ఆరని మంటలు

- మణిపూర్‌లో మళ్లీ కర్ఫ్యూ
- ఇంటర్నెట్‌పై నిషేధం



ఇంఫాల్ : మణిపూర్‌లో ఆందోళనలు ప్రజ్వరిల్లడంతో అక్కడ మళ్లీ కర్ఫ్యూ విధించారు. ఇంటర్నెట్ సేవలను నిలిపేశారు. గత రెండు మూడు రోజులుగా జరుగుతున్న హింసలో 11 మంది దాకా చనిపోగా, మరో 20 మంది గాయపడ్డారు. ఇంఫాల్ తూర్పు, పశ్చిమ, తౌబాల్ జిల్లాల్లో కర్ఫ్యూ, రాష్ట్ర వ్యాపితంగా అయిదు రోజుల పాటు ఇంటర్నెట్ సేవలు నిలిపేస్తూ ఆ రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోషల్ మీడియాలో పుకార్లు, తప్పుడు సమాచారం వ్యాపింపజేస్తారన్న భయంతో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు లీజ్ లైన్లు, విఎస్ఎటిఎస్, బ్రాడ్‌బాండ్స్, విపిఎన్ సర్వీసులతో సహా ఇంటర్నెట్ సేవలన్నిటిని నిలిపేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కర్ఫ్యూ అమలులో ఉన్న సమయంలో అత్యవసర సేవలు మినహా మిగతావేటినీ అనుమతించబోమని అధికారులు తెలిపారు. మణిపూర్‌లో బిజెపి ప్రభుత్వం సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం స్థానిక కుకీ, నాగా తెగలకు, మైదాన ప్రాంత మెయితీలకు మధ్య చిచ్చు పెట్టింది. దీనికి హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆజ్యం పోసింది. మెయితీలను ఎస్‌టీల జాబితాలో చేర్చుతూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు కొట్టివేసినప్పటికీ బిజెపి ప్రభుత్వం వీరి మధ్య వివాదాన్ని రాజేయడంతో గత ఏడాదిన్నర కాలంగా మణిపూర్‌లో అంతర్యుద్ధం సాగుతోంది. కుకీలు, నాగాలు క్రైస్తవులు కాగా, మెయితీలలో అత్యధిక భాగం హిందువులు. బిజెపి ప్రభుత్వ అండ చూసుకుని మెయితీలు కుకీలపై యధేచ్ఛగా దాడులకు తెగబడుతున్నారు. బిజెపి వివక్షా పూరిత విధానాలు ఈ ఈశాన్య రాష్ట్రంలో మత సామరస్యానికి తీవ్ర విఘాతమేర్పడింది. శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయి.

కొండ చరియలు విరిగిపడి వ్యక్తి మృతి

- ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

వర్షాలు, వరదలతోపాటు విరిగిపడుతున్న కొండచరియలు విజయవాడ నగరాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఇప్పటికే బుడమేరు, కృష్ణానది వరదల ధాటికి ఛిన్నాభిన్నమైన విజయవాడలో మంగళవారం మరోసారి కొండచరియలు విరిగిపడ్డాయి. మాచవరం మోడరన్ సూపర్ మార్కెట్ సమీపంలోని గూడ వెంకటస్వామి వీధిలో కొండ చరియలు విరిగిపడి కార్మిక నగర్‌కు చెందిన ఇజ్జడ రాము(55) అనే కార్మికుడు దుర్మరణం పాలయ్యారు. కామయ్య, హుస్సేన్ అనే ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం రాము మృతదేహాన్ని జిజిహెచ్ మార్చురీకి తరలించారు. విజయవాడ నగర పాలక సంస్థ సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఇటీవలే మొగల్రాజపురంలో కొండచరియలు విరిగి పడి ఐదుగురు మరణించిన విషయం తెలిసిందే.

బీమా కంపెనీల కొర్రీలు!

- విజయవాడ వరద ముంపు వాహనాల క్లెయిముల పరిష్కారంలో ని'బంధనాలు'
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



విజయవాడలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

'వరదకు వాహనంపై చేరిన బురదను కడిగేశారు. మీకు క్లెయిమ్ ఇవ్వలేము. మా ప్రతినిధి వచ్చి వాహనాన్ని పరిశీలించాలి. అప్పటి వరకు వాహనాన్ని షెడ్‌లోనే ఉంచండి. కుదరకపోతే మేము నిర్ధారించిన మొత్తం క్లెయిమునే తీసుకోండి. వరద ముంపులో ఉన్న వాహనాన్ని ఎందుకు ఫొటో తీయలేదు. మీ వాహనం మునిగిందని నిర్ధారించి మేము ఇప్పుడు ఎలా క్లయిమ్ చెల్లించగలం' విజయవాడలో భారీ వర్షాలు, బుడమేరు వరదల్లో ముంపునకు గురైన వాహనాలకు పాలసీ క్లయిముల పరిష్కారించడానికి బీమా కంపెనీలు ఇలా కొర్రీలు పెడుతున్నాయి. విజయవాడలోని జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్‌కు మంగళవారం మధ్యాహ్నానికి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో బీమా క్లయిముల పరిష్కారానికి 2,730 దరఖాస్తులు వచ్చాయి. క్లయిముల పరిష్కరించుకోవడానికి వచ్చిన వాహనదారులు బీమా కంపెనీల కొర్రీలను చూసి ఆందోళనకు గురవుతున్నారు. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్లయిముగా ప్రకటించిన మొత్తం ఏ మాత్రమూ చాలదని వాపోతున్నారు. కొందరు సొంత ఖర్చులతో తమ వాహనాలను రిపేరు చేయించుకుంటున్నారు.

కండ్రిక ప్లాట్ నంబర్ 25 చెందిన ఎం.రవికుమార్‌రెడ్డి ఆటో పది రోజులు వరద నీటిలో మునిగే ఉంది. నిబంధనలకు అనుగుణంగా జిఎస్‌టి ఉన్న మెకానిక్‌ను సంప్రదిస్తే ఇంజన్, గేర్‌బాక్స్, వైరింగ్ కాయిల్, ఇతరత్రా సామగ్రి మరమ్మతులకు రూ.25 వేలు వ్యయం అవుతుందని కొటేషన్ ఇచ్చారు. సమర్పించిన ఫొటోలో వాహనంపై బురద శుభ్రం చేసినట్లు ఉందని, క్లయిమ్ ఇవ్వలేమని శ్రీరామ్ ఇన్సూరెన్స్ కంపెనీ చెప్పడంతో ఆటో డ్రైవర్ కంగుతిన్నారు. దీనిపై వాగ్వివాదానికి దిగడంతో ఆటో కు రూ.2 వేలు మాత్రమే క్లయిమ్‌ను మిగతా7లో

బిగిసిన 'ఉక్కు' పిడికిలి

- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు
- విశాఖలో పలువురు అరెస్టు
- కూర్మన్నపాలెం కూడలిలో ఉద్రిక్తంగా మారిన ఆందోళన
- రాజమండ్రిలో పోలీసుల జులుం


తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో పోలీసులు నెట్టేయడంతో కిందపడిపోయిన ప్రజాసంఘాల నాయకురాలు తులసి

ప్రజాశక్తి - యంత్రాంగం


వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా పిడికిళ్లు బిగిశాయి. ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయొద్దని లక్షల గొంతులు నినదించాయి. పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, సెయిల్‌లో విలీనం చేయాలని కోరాయి. పారిశ్రామిక నగరం విశాఖ సహా అన్ని జిల్లాల్లో రాస్తారోకోలు జరిగాయి. కార్మికులు, రైతులు, వివిధ తరగతుల ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉక్కును అమ్మేవారి అంతుచూస్తామని పెద్దపెట్టున నినదించారు. విశాఖ కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద, పాత గాజువాక జంక్షన్, జాతీయ రహదారిపై శాంతియుతంగా జరుగుతున్న రాస్తారోకోలను భగ్నం చేయడానికి పోలీసులు ప్రయత్నించి విఫలమయ్యారు. 65 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అయినప్పటికీ వెరవకుండా పోరాటస్ఫూర్తితో ఉద్యమాన్ని అన్నిచోట్లా కార్మికులు, ప్రజలు ముందుకు తీసుకెళ్లారు. గడిచిన మూడున్నర సంవత్సరాల్లో ఎన్నడూ లేని విధంగా పోలీసులు అరెస్టులకు పూనుకోవడాన్ని విశాఖ ఉక్కు పోరాట కమిటీ తీవ్రంగా ఖండించింది.

కూర్మన్నపాలెం కూడలిలో పోరాట కమిటీ దీక్షా శిబిరం వద్ద చేపట్టిన రాస్తారోకో విజయవంతమైంది. మంగళవారం ఉదయానికే పోలీసులు ఇక్కడ పెద్ద సంఖ్యలో మోహరించడంతో ఉద్రిక్త పరిస్థితులు అలుముకున్నాయి. పోలీసులు ఆందోళనకారులను ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నం చేశారు. రాస్తారోకో చేస్తున్న 15 మంది కీలక నాయకులను అరెస్టు చేసి, మధ్యాహ్నం విడుదల చేశారు. అరెస్టయిన వారిలో పోరాట కమిటీ చైర్మన్లు సిహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ తదితరులు ఉన్నారు. తొలుత రాస్తారోకోను ఉద్దేశించి నర్సింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు అప్పగించే కుట్రలో భాగంగానే కేంద్ర బిజెపి ప్రభుత్వం


ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావును అరెస్టు చేస్తున్న పోలీసులు

నిర్వీర్యం చేస్తోందన్నారు. అవసరమైన ముడి సరుకు ఇస్తే ప్లాంట్‌ను లాభాల బాట పట్టించేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న కాలంలో ఉక్కు ఉద్యమం మరింత ఉధృతం కానుందని, ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ఎటువంటి త్యాగాలకైనా కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ తదితరులు రాస్తారోకోను ఉద్దేశించి మాట్లాడారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం రాస్తారోకో నిర్వహించారు. కొత్తగాజువాక నుంచి పాత గాజువాక వరకు ప్రదర్శన చేపట్టారు. అనకాపల్లి నాలుగు రోడ్ల సెంటర్‌లో చేపట్టిన రాస్తారోకోలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ విశాఖ ఉక్కుపై కేంద్రం చేస్తున్న కుట్రలను తెలియజేశారు. అల్లూరి జిల్లా అరకులోయలో సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో, హుకుంపేటలో నిరసన ర్యాలీ చేపట్టారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాస్తారోకోపై పోలీసులు జులుం ప్రదర్శించారు. స్థానిక శ్యామల సెంటర్లో సిఐటియు, ఐఎఫ్‌టియు ఇతర కార్మిక, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందంటూ కార్మిక సంఘాల నేతల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్‌ను చొక్కా పట్టుకుని పక్కకు నెట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న తమపై దురుసుగా ప్రవర్తించడం తగదని వారించినా పోలీసులు వెనక్కి తగ్గలేదు. రోడ్డుపై కూర్చుని ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు టి.తులసి, ఎన్ రాజాలను పోలీసులు బలంగా నెట్టేయడంతో నేలపై పడిపోయారు. ఈ క్రమంలో రాజా చేతికి గాయమైంది. కార్మిక సంఘాల ప్రతినిధులు అడ్డుకోవటంతో పోలీసులు వెనక్కి తగ్గారు. అనంతరం నేతలు ఆందోళన కొనసాగించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో గడియార స్తంభం సెంటర్‌లో, కాకినాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకోలు చేశారు. కాకినాడలో సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను దొడ్డిదారిన ప్రయివేటీకరించేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. ఇందులో భాగంగానే బ్లాస్ట్ ఫర్నేస్ రెండింటిని ఉద్దేశపూర్వకంగా మూసివేశారని తెలిపారు. ఉత్పత్తి పడిపోయేలా చేసి పరిశ్రమను నష్టాల్లోకి నెట్టాలని చూస్తోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని టిడిపి కూటమి నేతలు మేల్కొని విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. గుంటూరు శంకర్‌విలాస్ సెంటర్‌లో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ జంక్షన్ వద్ద రాస్తారోకోలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి తులసి రఘు పాల్గొన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, ప్రకాశం, ఏలూరు, పశ్చిమగోదావరి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, పల్నాడు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో రాస్తారోకోలు నిర్వహించారు. ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు.


ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి శాంతినగర్ - కవులూరు వద్ద బుడమేరు పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

బుడమేరు పనులను పరిశీలించిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి శాంతినగర్-కవులూరు గ్రామాల మధ్య బుడమేరు మళ్లింపు కాలువకు గండిపడిన ప్రదేశాలను మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశీలించారు. గండ్లు పడిన తీరు, వాటిని యుద్ధప్రాతిపదికన పూడ్చివేయడం, వరద ప్రవాహం తదితర విషయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. బుడమేరు కట్టల పటిష్టతకు తీసుకుంటున్న చర్యల గురించి సిఎం చంద్రబాబుకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వివరించారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం బుడమేరు అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. ప్రకాశం బ్యారేజి వద్ద పడవలు ఢీకొన్న ఘటనలో నేరస్తులను వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు, స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ బుడమేరు గండ్ల పూడ్చివేతకు నిరంతరం శ్రమించారని తెలిపారు. గత ఐదేళ్లలో బుడమేరు మొత్తం కబ్జాలకు గురైందన్నారు. అక్రమ కట్టడాలు పెరిగిపోవడంతోపాటు దానిలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో లక్షలాది మంది జీవితాలు అతలాకుతలమయ్యాయని వివరించారు. వరదలో నష్టపోయిన ప్రతి ఒక్కరినీ అదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళాల వెల్లువ

- ఒకరోజు వేతనాన్ని ప్రకటించిన రాష్ట్ర ఐఎఎస్‌లు
- రూ.7.7 కోట్లను అందించిన సర్పంచుల సంఘం
- రూ 2.7 కోట్లను ఇచ్చిన ఎక్సైజ్ ఉద్యోగులు
- రూ.14.09 కోట్లను అందజేసిన విద్యుత్ ఉద్యోగులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలో బుడమేరు వరద సృష్టించిన విధ్వంసానికి మానవీయ సాయం వెల్లువలా వస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, పలు సంస్థలు పెద్ద మొత్తంలో సిఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళం అందజేశారు. మంగళవారం విజయవాడలోని కలెక్టరు కార్యాలయంలో వున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆధ్వర్యాన రాష్ట్రంలోని ఐఎఎస్‌లు అంతా ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందించారు. సీనియర్ ఐఎఎస్ అధికారులు ఆర్‌పి సిసోడియా, జి సాయిప్రసాద్, బి రాజశేఖర్, కృష్ణబాబు, విజయానంద్, వీర పాండ్యన్, సృజన తదితరులు ఈ మేరకు ముఖ్యమంత్రికి అంగీకార పత్రాన్ని అందజేశారు. అలాగే ఎపి సర్పంచుల సంక్షేమ సంఘం రూ.3.92 కోట్లు, పంచాయతీరాజ్ ఛాంబర్ ఎపి సర్పంచుల సంఘం రూ.7.7 కోట్లను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందించారు.

విద్యుత్ శాఖ ఉద్యోగులు రూ.14,09,20,405 భారీ విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. విద్యుత్ జెఎసి ఉద్యోగులు ఒక రోజు వేతనాన్ని రూ.10,61,81,614 కోట్లు ప్రకటించారు. ఎపి ఎస్‌ఇబి ఇంజనీర్స్ అసోసియేషన్, ఎపిఎస్‌ఇబి అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ విడిగా మరో రూ.3.47కోట్లు అందించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నేతృత్వంలో విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆధ్వర్యాన సిఎం చంద్రబాబు నాయుడును కలిసి ఇందుకు సంబంధించిన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్‌బాబు, ట్రాన్స్‌కో జెఎమ్‌డి కీర్తి చేకూరి, ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డి పట్టంశెట్టి రవిసుభాష్, విద్యుత్ ఇంజనీరింగ్ అసిసోయేషన్, జెఎసి ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ ఉద్యోగులు రూ.2.70 కోట్ల చెక్కును ముఖ్యమంత్రికి అందజేశారు. ఎక్సైజ్‌శాఖ కమిషనరు నిశాంత్ కుమార్ ద్వారా ఒకరోజు వేతనంతో కూడిన ఈ చెక్కును ముఖ్యమంత్రికి అందజేశారు. అలాగే ధర్మవరం పట్టణానికి చెందిన జెఆర్ సిల్క్ శారీస్ అధినేత జింకా రామాంజనేయులు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ద్వారా రూ.15 లక్షల చెక్కును ముఖ్యమంత్రికి అందించారు. విలేజ్ సర్వేయర్లు రూ.80 లక్షలు విరాళాన్ని అందించారు. తాపేశ్వరం సురుచి ఫుడ్స్ అధినేత పివివిఎస్ మల్లికార్జునరావు రూ.20 లక్షలు, డ్రీమ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రూ.10 లక్షలు, ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షులు పెనుగొండ సుబ్బరాయుడు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. మంత్రి సవిత చేతులమీదుగా అమరావతి రైతులు రూ.3.3 లక్షలు విరాళంగా అందజేశారు.

ప్రకాశం బ్యారేజీకి స్థిరంగా వరద

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రకాశం బ్యారేజీకి మంగళవారం వరద స్థిరంగా కొనసాగుతోంది. ఎగువ నుంచి 1,93,237 క్యూసెక్కుల నీరొస్తుండగా 1512 క్యూసెక్కుల నీరు కాలవలకు విడుదల చేస్తున్నారు. 1,91,725లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. నాగార్జున సాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి 2.78 లక్షల క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా 2.09 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల జలాశయాన్కి 2.23 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా 2.30 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

పారదర్శకంగా పత్తి కొనుగోళ్లు

- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేటట్లు చర్యలు తీసుకున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మార్కెటింగ్ శాఖ, కాటన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొదటి దశలో 50 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. కొనుగోళ్ల కోసం నూతన మార్గదర్శకాలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో పత్తి పంట ఈ ఏడాది 5.79 లక్షల హెక్టార్లలో సాగయ్యిందని, ఆరు లక్షల టన్నుల దిగుబడి రావచ్చని అంచనా వేసినట్లు తెలిపారు. సిసిఐ, మార్కెటింగ్‌శాఖ గుర్తించిన మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల్లోనే కొనుగోళ్లు జరిగే విధంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కొనుగోళ్ల ప్రక్రియ జరగడంతోపాటు ఆన్‌లైన్ కొనుగోలు విధానం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు సిసి కెమెరాల ఏర్పాటు, బీమా సదుపాయం కలిగి ఉండాలని అధికారులను ఆదేశించామన్నారు. పత్తి సేకరణకు కొనుగోలు కేంద్రాల్లో ప్రతి రోజు సాయంత్రం 5గంటల వరకు అనుమతిచ్చామని, రైతుల ప్రయోజనం కోసం సాయంత్రం 6గంటల వరకు (ఒక గంట అదనం) గ్రేస్‌పీరియడ్‌గా కేటాయించామని తెలిపారు.

లైంగిక వేధింపుల కేసు కొట్టేయండి

- హైకోర్టులో టిడిపి ఎమ్మెల్యే ఆదిమూలం పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

తనపై నమోదైన అత్యాచారం ఆరోపణల కేసును కొట్టేయాలంటూ సత్యవేడు టిడిపి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించారు. ఏవిధమైన ప్రాథమిక విచారణ చేయకుండానే కేసు నమోదు చేశారని, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 173(1)కి వ్యతిరేకంగా కేసు నమోదు చేశారన్నారు. ఎమ్మెల్యే తనపై పలుమార్లు లైంగిక వేధింపులకు, అత్యాచారానికి పాల్పడ్డారంటూ టిడిపి నాయకురాలు ఈ నెల 5న తిరుపతి తూర్పు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు 72 ఏళ్లని, కావాలని కేసులో ఇరికించారని, ఇది హనీ ట్రాప్ అని పిటిషన్‌లో పేర్కొన్నారు. వీడియోలన్నీ మార్ఫింగ్‌వేనని తెలిపారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారణ చేయనుంది.

మేయర్ భర్త జయవర్ధన్‌కు 14 రోజులు రిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు కార్పొరేషన్ మేయర్ స్రవంతి భర్త జయవర్ధన్ మంగళవారం నెల్లూరు కోర్టులో లొంగిపోయారు. నెల్లూరు కార్పొరేషన్‌లో మార్టిగేజ్ రిలీజ్ విషయంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని మూడు నెలలుగా కేసు కొనసాగుతోంది. ఇందులో ప్రధాన నిందితుడిగా ఉన్న జయవర్ధన్ గత కొంత కాలంగా తప్పించుకు తిరుగుతున్నారు. 2019 నుంచి మార్టిగేజ్ ఇప్పిస్తామని చెప్పి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరు కార్పొరేషన్ అధికారులు, ఇద్దరు ప్రయివేటు వ్యక్తులు, మరో ఇద్దరు ప్రయివేటు ఇంజనీర్లతోపాటు జయవర్ధన్ ఉన్నారు. ఇప్పటికే ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు నుంచి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టు, సుప్రీం కోర్టుకు జయవర్ధన్ వెళ్లి బెయిల్ మంజూరు కాకపోవడంతో నెల్లూరు 4వ అదనపు కోర్టులో లొంగిపోయారు. ఆయనకు 14 రోజులు రిమాండ్ విధించారు. నెల్లూరు సెంట్రల్ జైలుకు ఆయనను తరలించారు. మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కరాలపాడు గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ (37) షేక్ మహ్మద్ గత కొన్నేళ్లుగా నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి, మిరప, వరి సాగు చేస్తున్నారు. పంటల సాగు నిమిత్తం సుమారు రూ.12 లక్షల వరకు అప్పు చేశారు. ఏటికేడు వ్యవసాయంలో నష్టాలు రావడండో అప్పు తీర్చడం కష్టమైంది. పంటల దిగుబడి లేకపోవడం, రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. షేక్ మహ్మద్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

అన్నార్తులకు అండగా కార్మిక, ప్రజా సంఘాలు

- వేలాదిమంది ఆకలితీరుస్తున్న ఆహార పంపిణీ కేంద్రాలు

ప్రజాశక్తి- విజయవాడ

వివిధ ప్రజాసంఘాలు, సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న పుచ్చలపల్లి సుందరయ్య స్మారక నిరంతర ఆహార పంపిణీ కేంద్రాలు వరద బాధితుల కడుపు నింపుతున్నాయి. మొత్తం ఆరు కేంద్రాల ద్వారా వేలాది మందికి మధ్యాహ్నం, రాత్రి భోజనం పంపిణీ చేస్తున్నారు. అజిత్‌సింగ్ నగర్ పైపుల రోడ్డు, వాంబే కాలనీ, రాజీవ్ నగర్, న్యూ రాజరాజేశ్వరిపేట (ఆర్‌ఆర్‌పేట), కృష్ణా హోటల్ సెంటర్, వన్‌టౌన్ ఉర్మిళానగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు వరద బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి. ఒక్కో కేంద్రంలో రోజుకు సరాసరి మూడు వేల మందికి మొత్తంగా 12 వేల మందికి మధ్యాహ్నం, రాత్రి భోజనం పంపిణీ చేస్తున్నారు. అన్నం, సాంబారు, పులుసుకూర వంటి రుచికరమైన వేడివేడి ఆహార పదార్థాలు వండి పెడుతున్నారు. 'మీకు మేమున్నామం' అంటూ ఎంబి విజ్ఞాన కేంద్రం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, కెవిపిఎస్, జెవివి తదితర ప్రజాసంఘాలు, సిపిఎం ఆధ్వర్యాన సుమారు వంద మందికిపైగా ఆహారాన్ని పంపిణీ చేస్తూ బాధితుల ఆకలి తీరుస్తున్నారు. వరద బాధితులతోపాటు పారిశుధ్య కార్మికులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలి వచ్చి భోజనం చేసి వెళ్తున్నారు.


విజయవాడ వాంబేకాలనీలో ఏర్పాటు చేసిన ఆహార కేంద్రంలో భోజనం చేస్తున్న వరద బాధితులు

ప్రభుత్వం ప్యాకెట్ల ద్వారా పంపిణీ చేస్తున్న బిర్యానీ, పులిహోర, పెరుగన్నం, ఇతర ఆహార పదార్థాలు నాణ్యతలేకుండా ఉంటున్నాయి. ప్యాకెట్లలో మెత్తబడిపోయి తినే సమయానికి పనికి రాకుండా పోతున్నాయి. రోజుల తరబడి ఒకే రకమైన బిర్యానీ ప్యాకెట్లు ఇస్తుండడంతో దానిని తినలేక, తిన్నా సరిగా జీర్ణం కాక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాంబే కాలనీలో భోజనం చేసిన పలువురు పోలీసు, ఇతర అధికారులు చెప్పారు. ఈ కేంద్రాల నిర్వహణ తీరు, భోజనం ఏర్పాట్లపై పలు పార్టీల నేతలు, రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుండి వచ్చిన పలువురు ఉన్నతాధికారులు కూడా అభినందిస్తున్నారు. ఈ కేంద్రాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి.మధు, కార్యదర్శి పి.మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.


చాకలి ఐలమ్మ, రామకృష్ణకు నివాళులర్పిస్తున్న నేతలు

ఐలమ్మ, రామకృష్ణ ఆశయాలు కొనసాగిస్తాం

- ఎపి రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురుశేఖర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వీరనారి చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ ఆశయాలను కొనసాగిస్తామని ఎపి రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.గురుశేఖర్ తెలిపారు. కర్నూలులోని కార్మిక కర్షక భవనంలో చాకలి ఐలమ్మ, రామకృష్ణ వర్ధంతి సభ ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.ముక్కన్న అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముందుగా ఐలమ్మ, రామకృష్ణ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడతూ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం సాయుధ రైతాంగ పోరాటంలో తన వంతు పాత్ర పోషించిన వీర వనిత చాకలి ఐలమ్మ చరిత్రను నేటి తరం గుర్తుపెట్టుకోవాలన్నారు. ఆమె జీవిత చరిత్ర భావితరాలకు తెలియజేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. తన పోరాట పటిమతో రజకులకు ఘనకీర్తిని సంపాదించి పెట్టిన ఐలమ్మ చరిత్ర తెలుగు రాష్ట్రాలకే కాకుండా యావత్ భారతదేశంలో ఉన్న రజకులకు గర్వకారణమని తెలిపారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా 2000 ఆగస్టు 28న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వామపక్షాలు, ప్రజా సంఘాలు, చేతి వృత్తిదారులు చేపట్టిన చలో అసెంబ్లీ సందర్భంగా బషీర్‌బాగ్ వద్ద పోలీసుల కాల్పుల్లో సత్తెనపల్లి రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి మృతి చెందారని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి తరహాలో రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

లేనిపక్షంలో రజక వృత్తిదారులను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి కళాకారులు జిబి.మద్దిలేటి, బాలు, నాగ సుంకన్న, డప్పు సుబ్బరాయుడు.. చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణల జీవిత గాథలను పాటల రూపంలో అలరించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

బుడమేరు కోసం మూడు శాఖలతో ప్లాన్ ఆఫ్ యాక్షన్

- త్వరలో ఇరిగేషన్ కాలువల సమగ్ర సర్వే : మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

"ఆపరేషన్ బుడమేరు " కోసం మూడు శాఖల ఆధ్వర్యాన ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందిస్తున్నామని, ఇరిగేషన్ కెనాల్స్, మునిసిపల్ డ్రెయిన్స్‌ను కూడా ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. విజయవాడలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తి కాగానే పరిహారం చెల్లిస్తామన్నారు. త్వరలో ఇరిగేషన్ కాలువల సమగ్ర సర్వే నిర్వహిస్తామన్నారు. బుడమేరు ఆక్రమణల తొలగింపునకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఇప్పుడున్న చట్టం వాటికి సరిపోతుందని, అవసరమైతే కొత్త చట్టం చేసేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. విజయవాడలోని 64 డివిజన్లలో 32 డివిజన్లు ముంపునకు గురయ్యాయన్నారు. ఇప్పటికే 26 డివిజన్లలో నీటిని క్లియర్ చేశామని పేర్కొన్నారు.

ప్రజలు, అధికారుల సహకారంతో విపత్తు ఎదుర్కొన్నాం

మొదటిపేజీ తరువాయి

ప్రకాశం బ్యారేజీని డ్యామేజ్ చేసేందుకు ప్రయత్నించారన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చంద్రబాబు స్పష్టం చేశారు.

నేటి నుంచి ఉత్తరాంధ్ర పర్యటన

విజయవాడతోపాటు లంక గ్రామాలు, కొల్లేరు ప్రాంతం, విశాఖపట్టణంలో కొండచరియలు విరిగి పడటం వల్ల కొంత ఇబ్బంది జరిగిందని, వాటన్నింటిని అధ్యయనం చేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఈనెల 11 నుంచి ఏలేరు బాధితులు, విశాఖ బాధితులను పరామర్శిస్తానన్నారు. అనంతరం నందివాడ, కొల్లేరు, బాపట్ల లంక బాధితులను, వేమూరు బాధితులను పరామర్శిస్తానని తెలిపారు. 10 రోజుల తర్వాత మంగళవారం రాత్రి విజయవాడ కలెక్టరేట్ నుంచి ఉండవల్లిలోని ఆయన నివాసానికి చంద్రబాబు వెళ్లారు.

ప్రత్యేక హోదా కోసం పాల్ పిల్

ప్రజాశక్తి - అమరావతి

లోక్‌సభలో నాటి ప్రధాని ఇచ్చిన హామీకి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్ దాఖలు చేసిన పిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన కేంద్ర హోంశాఖ కార్యదర్శి, కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి, నీతి ఆయోగ్ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిలను ఆదేశించింది. విచారణను ఈ నెల 24కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ మండవ కిరణ్మయి డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది. ఇదే అంశంపై గతంలో దాఖలైన వ్యాజ్యాలతో ఈ పిల్‌ను జత చేయాలని రిజిస్ట్రీకి ఉత్తర్వులు ఇచ్చింది. ఈ పిల్‌ను సిజె ముందుంచాలని ఆదేశించింది. రాష్ట్ర విభజన చేసినప్పుడు పార్లమెంట్లో కేంద్రం పలు హామీలు ఇచ్చిందని, వాటిని రాష్ట్ర విభజన తర్వాత అమలు చేయలేదని పాల్ చెప్పారు.

బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన నందిగం

టిడిపి ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో అరెస్టయిన మాజీ ఎంపీ నందిగం సురేష్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. గుంటూరు జైల్లో ఉన్న తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. టిడిపి ఆఫీసుపై దాడి ఘటనతో తనకు ఏ సంబంధమూ లేదని, ఎటువంటి ఆధారాలు లేకపోయినా రాజకీయ కక్షతో కేసు పెట్టారని పేర్కొన్నారు. దాడి ఘటన జరిగిన రెండేళ్లకు కేసులో తనను ఇరికించారని తెలిపారు. కేసు దర్యాప్తు పూర్తయ్యిందని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్లు వివరించారు. బెయిల్ షరతులను అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారించనుంది. ఇదే కేసులో వైసిపి సానుభూతిపరుడు ఎ.శ్రీనివాస్‌రెడ్డి కూడా బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ విఆర్ కృపాసాగర్ మంగళవారం విచారించారు. కేసు వివరాలను సమర్పించాలని పోలీసులను ఆదేశించి విచారణను ఈ నెల 17కి వాయిదా వేశారు.

పంట రుణాలు మాఫీ చేయండి

- ముఖ్యమంత్రికి రైతు సంఘాల సమన్వయ సమితి విజ్ఞప్తి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వరదల నేపథ్యంలో బ్యాంకుల్లో రైతాంగం తీసుకున్న పంట రుణాలను రద్దు చేసి, వారికి అండగా ప్రభుత్వం నిలబడాలని ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కోరింది. ఈ మేరకు మంగళవారం సమన్వయ సమితి కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సిఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో తీసుకున్న పంట రుణాలన్నింటినీ రద్దు చేసి అండగా నిలబడాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 19 జిల్లాల్లో 5 లక్షల ఎకరాలకు పైగా ఆహార, వాణిజ్య, ఉద్యానవన, కూరగాయల పంటలన్నీ దెబ్బతిన్నాయన్నారు. ఆర్థికంగా రైతాంగానికి నష్టం వాటిల్లిందన్నారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. నీట మునిగిన పంటలకు ఇన్సూరెన్సు చేసి పంటల పరిహారం చెల్లించాలని, వీటితోపాటు సొసైటీ భూములు, లంక భూములు, ఆలయ భూములు సాగుచేసే వారందరికీ పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. భారీ వరదల వల్ల గృహాలన్నీ మునిగిపోవడంతో నష్టపోయిన ప్రతి కుటుంబానికీ తక్షణమే రూ.25 వేలు చొప్పున ఆర్థిక సహకారం అందించడంతోపాటు నిత్యావసర వస్తువులన్నింటినీ అందించి ఆదుకోవాలన్నారు. బుడమేరు నుంచి ఎటువంటి ప్రమాదం భవిష్యత్తులో జరగకుండా ఉండటానికి ఎసి మిత్ర, కె శివరామకృష్ణయ్య కమిటీలు సూచించిన వరద నిరోధక చర్యలను వెంటనే పూర్తి చేయాలన్నారు.

ఎగువ ప్రాంతాల్లో అవకాశం ఉన్నచోట రిజర్వాయర్లు నిర్మించాలని, దిగువ ప్రాంతంలో బుడమేరు వరద ప్రవాహానికి ఉన్న అవరోధాలను తొలగించాలని, కరకట్టను బలపరచాలని సూచించారు. విజయవాడ నగరం నుంచి కొల్లేరు వరకు అక్కడ నుంచి ఉప్పుటేరు సముద్రంలోకి వెళ్లేందుకు ఆటంకం ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. ఈ సందర్భంగా నష్టపోయిన వారికి పునరావాసం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాయనపాడు నుంచి గుంటుపల్లి మధ్యగా బుడమేరుకు మరో డైవర్స్ ఛానెల్ నిర్మించి కృష్ణా నదిలోకి వరద నీటిని మళ్లించవచ్చని నిపుణులు చెబుతున్నారని, ఆ అంశాన్నీ పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిఎం చంద్రబాబును కలిసిన రైతు సంఘాల ప్రతినిధుల బృందంలో వై కేశవరావు, అక్కినేని భవానీ ప్రసాద్, డి హరినాథ్, పి జమలయ్య, చల్లపల్లి విజయ, మరీదు ప్రసాద్‌బాబు, కొల్లా రాజమోహన్, పి వీరాంజనేయులు, గోగినేని ధనశేఖర్, కోగంటి ప్రసాద్, కాసాని గణేష్, సూర్యప్రసాద్, చెరుకూరి వేణు, మల్లెపు లక్ష్మీనారాయణ ఉన్నారు.

సామాజిక బాధ్యతతో ముందుకు రావాలి

- ఎలక్ట్రానిక్ కంపెనీల ప్రతినిధులతో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వరదలతో విజయవాడ నగరంలోని పలు ఇళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువులు తడిచి పాడై పోయాయని, కంపెనీలు సామాజిక బాధ్యతతో బాధిత ఎలక్ట్రానిక్ వస్తువులు బాగు చేసేందుకు ముందుకు రావాలని సిఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. విజయవాడ కలెక్టరేట్‌లో మంగళవారం ఎలక్ట్రానిక్ కంపెనీల ప్రతినిధులతో సిఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పేర్ పార్ట్స్‌ను డిస్కౌంట్‌లో అందించాలని, ఎలక్ట్రానిక్ కంపెనీల సేవల బృందాలు ఒకే వేదిక మీదకు వచ్చి సర్వీస్ అందిస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. కంపెనీల వారీ హెల్ప్ లైన్ ఏర్పాటు చేసి అదనంగా టెక్నీషియన్లను ఏర్పాటు చేసుకోవాలని ఎలక్ట్రానిక్ కంపెనీల ప్రతినిధులకు సిఎం సూచించారు. వారం రోజులు టార్గెట్ పెట్టుకుని పని చేయాలన్నారు. వరద ప్రాంతాల్లో ప్రత్యేక సర్వీస్ హెల్ప్ లైన్ ఏర్పాటు చేసి సేవలందిస్తామని కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలియజేశారు.

బెంగాల్ లారీల బంద్‌కు మద్దతు

- ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ ట్రక్ ఆపరేటర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో చేపట్టిన లారీల బంద్‌కు ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఈ మేరకు ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లో రవాణా రంగంపై అధికారుల వేధింపులు తీవ్రంగా వున్నట్లు పేర్కొన్నారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసుల వేధింపులకు నిరసనగా మూడు రోజులపాటు రవాణా వాహనాలన్నింటినీ నిలిపేస్తున్నారని తెలిపారు. బెంగాల్ లారీ ఓనర్లకు మద్దతుగా రాష్ట్రంలోని లారీలు కూడా పశ్చిమ బెంగాల్‌కు వెళ్లకుండా చూసుకోవాలని రాష్ట్రంలోని లారీ యజమానులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి లారీ యజమాని బెంగాల్ బంద్ విజయవంతానికి సహకరించాలన్నారు.

గ్రామాల్లో ఆపద మిత్ర బృందాలు ఏర్పాటు

- ప్రకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తత అవసరం
- రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తక్షణ రక్షణ, సహాయక చర్యల్లో బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలు, అధికారులను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఆపద మిత్ర బృందాలను సిద్ధం చేసి, వారికి ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన సహాయక చర్యలపై తగిన శిక్షణ ఇస్తే ముందస్తు రక్షణ చర్యలకు మరింత అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాలపైనా, తీసుకున్న సహాయక చర్యలపైనా విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో విశాఖ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడిచిన 15 రోజుల్లో రాష్ట్రంలో రెండు తుపాన్లు వచ్చాయని, ఈ నెల 8, 9 తేదీల్లో భారీ వర్షాలు కురిశాయని తెలిపారు. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో విజయవాడలో తీసుకున్న మాదిరిగా సహాయక, రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జలాశయాల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని, రిజర్వాయర్ల గేట్లు పనితీరును పున:సమీక్షించుకోవాలని, పనిచేయని గేట్లకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో పొరుగు రాష్ట్రాల నుంచి ముందస్తు సమాచారాన్ని సేకరించడం ద్వారా జిల్లాల్లోని ముంపు, పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ముందుగా తరలించేందుకు వీలుంటుందని తెలిపారు. సమావేశంలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభాలను రాజకీయంగా వాడుకుంటున్న చంద్రబాబు

- మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎలాంటి సంక్షోభాలు వచ్చినా రాజకీయంగా వాడుకుని లబ్ధిపొందడం సిఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. ప్రకృతి విపత్తుతో భారీ వరదలు వస్తే అందుకు జగన్‌మోహన్‌రెడ్డి కారణమంటూ విష ప్రచారానికి పూనుకోవడం తగదని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా నదికి రికార్డు స్థాయిలో వచ్చిన 11.43 లక్షల క్యూసెక్కుల వరదకు మొత్తం 432 బోట్లు పూర్తిగానూ, మరో 202 పడవలు పాక్షికంగానూ దెబ్బతిన్నట్లు వరద నష్ట నివేదికల్లో చెప్పిన ప్రభుత్వం ప్రకాశం బ్యారేజీలో ఇరుక్కుపోయిన మూడు పడవలపై మాత్రం తప్పుడు విమర్శలు చేస్తుందని అన్నారు. బ్యారేజీలోకి మూడు బోట్లతోపాటు టూరిజం బోట్లు కూడా వచ్చాయని తెలిపారు. బోట్లు తెగిపోతే వైసిపికి ఏమి సంబంధం అని ప్రశ్నించారు. ఈ కేసులో కోమటి రామ్మోహన్, ఉషాద్రిని అరెస్టు చేసి వారు వైసిపి వారిగా ప్రచారం చేస్తున్నారని, వాస్తవంగా వారు టిడిపి నాయకులకు సన్నిహితులని తెలిపారు. వైసిపి నాయకులను అక్రమ కేసులతో వేధిస్తూ బెయిల్ రాకుండా కొత్తకొత్త కేసులు పెడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే నంబూరి శంకర్రావు వరద ప్రాంతాల పరిశీలనకు వెలితే పోలీసుల సమక్షంలోనే దాడిచేయడం దుర్మార్గమన్నారు.



ఏలూరు-కైకలూరు ప్రధాన రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న కొల్లేరు వరద నీరు

నిలకడగా కొల్లేరు వరద

- ఆగడాల లంక ఛానల్ వెంబడి రోడ్డుపైకి నీరు

ప్రజాశక్తి - మండవల్లి (ఏలూరు జిల్లా)

కొల్లేరుకు వరద నీటి ప్రవాహం మంగళవారం నిలకడగా ఉంది. సోమవారం 3.45 మీటర్లు ఉన్న నీటిమట్టం మంగళవారం అదే నీటి మట్టంతో నిలకడగా ఉండటంతో కొల్లేరు ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, లంక గ్రామాలను కొల్లేరు ముంచేస్తోంది. 18 గ్రామాలు వరద నీటిలో చిక్కుకుపోగా, రహదారులు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఏలూరు-కైకలూరు ప్రధాన రహదారిపై వరద ఉధృతంగా ప్రవహిస్తూ నదిని తలపిస్తోంది. ఆగడాలలంక ఛానల్ వెంబడి రోడ్డుపైకి నీరు చేరింది. పెదెడ్లగాడి వెంతన వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. నిత్యావసర సరుకులు తెచ్చుకునే అవకాశం లేకపోవడంతో ఆహారం, నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు బియ్యం, పప్పు, నూనె, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, పంచదార నీట మునిగిన ఇళ్ల వారికే అందించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు మునగనప్పటికీ బయటకెళ్లి తెచ్చుకునే అవకాశం లేదని, తమను పట్టించుకోవాలని వాపోయారు. అందరికీ సరుకులు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఇన్‌ఛార్జి తహశీల్దార్ గోపాల్‌ను వివరణ కోరగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నీట మునిగిన నివాసాల వారికి ముందుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తున్నామని, తరువాత వచ్చే సరుకులను అందరికీ పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పల్నాడులో ఉద్రిక్తత

- మాజీ ఎమ్మెల్యే శంకర్రావు కాన్వాయ్‌పై దాడి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లాలో అమరావతి మండలంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వరద ముంపు గ్రామాలను పరిశీలించేందుకు వెళ్తున్న వైసిపి నాయకులను టిడిపి కార్యకర్తలు అడ్డుకున్నారు. దారి మధ్యలోనే కాన్వాయ్‌ను ఆపి దాడికి దిగారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించేందుకు పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు మంగళవారం తన అనుచరులతో వెళ్లారు. విషయం తెలుసుకున్న టిడిపి కార్యకర్తలు అమరావతిలో ఆయన కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. అమరావతిలో ఇంత భారీగా ముంపు రావడానికి శంకర్రావే కారణమని, ఇసుక తవ్వకాల కోసం కష్ణానది ప్రవాహానికి అడ్డుగా రోడ్డు వేయడం వల్లే గతంలో ఎన్నడూ లేనంతగా ముంపు సమస్య వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన కాన్వాయ్‌పై కర్రలతో దాడికి దిగారు. పోలీసులు అడ్డుపడుతున్నా ఆగకుండా ఓ వాహనాన్ని ధ్వంసం చేశారు. పరిస్థితి ఉద్రిక్తతంగా మారడంతో ఆయన తన పర్యటనను ముగించుకుని గుంటూరుకు తిరిగి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా నంబూరు శంకర్రావు మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎక్కడికైనా వెళ్లే స్వేచ్ఛ ఉందని, గత ఐదు సంవత్సరాలపాటు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసిన తనకు నియోజవర్గంలోకి రావద్దని చెప్పటానికి టిడిపి నాయకులు ఎవరని ప్రశ్నించారు.

పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- 'గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధి-కార్మికుల సమస్యలు'పై సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు

పంచాయతీల సమగ్ర అభివృద్ధికి, పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎపి పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా మహాసభ సందర్భంగా 'గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధి-కార్మికుల సమస్యలు' అనే అంశంపై పాతగుంటూరులోని సిఐటియు కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సదస్సు మంగళవారం జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు బూరగ రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసిందన్నారు. రాజ్యాంగబద్ధంగా పంచాయతీలకు రావాల్సిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లించడం వల్ల ఇప్పుడు గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించటానికి నిధులు లేవన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధిలో కార్మికులు ముఖ్యపాత్ర పోషిస్తారన్నారు. టెండర్ విధానం కార్మికులకు నష్టదాయకమని తెలిపారు. తాను డిపిఒగా ఉన్న సమయంలో టెండర్ విధానం అమలు కాకుండా కృషి చేసినట్లు చెప్పారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గతంలో విడుదలైన జిఒ 551, తదితర జిఒలు అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రామాంజనేయులు మాట్లాడుతూ నూతన ప్రభుత్వంలో పంచాయతీలకు పూర్వ వైభవం తెస్తామన్నారు. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 13 వేలకుపైగా పంచాయతీల్లో 27,800 మంది పంచాయతీ కార్మికులు, మరో 18 వేల మంది గ్రీన్ అంబాసిడర్లతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేజర్ పంచాయతీల్లో సైతం అత్యధిక మందికి రూ.6 వేల జీతం మాత్రమే ఇస్తున్నారని, అవి కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటాయని తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ అమలు కావట్లేదన్నారు. నూతన ప్రభుత్వమైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

బడా కంపెనీల నుంచి సెబీ చీఫ్‌కు భారీ ఆదాయం..!

- మహీంద్రా, డాక్టర్ రెడ్డీస్, ఐసిఐసిఐ బ్యాంక్‌లతో దోస్తీ
- మరో మూడు సంస్థలతోనూ..
- మాధబి కంపెనీకి కోట్ల రాబడి
- ఆమె భర్త దావల్‌కు సంపాదన
- కాంగ్రెస్ తీవ్ర విమర్శలు



న్యూఢిల్లీ : సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పూరి బుచ్ అక్రమ ఆర్థిక లావాదేవీలు మరిన్ని బయటపడ్డాయి. అదానీ విదేశీ సంస్థలతో మాధబి అంటకాగారని అమెరికన్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ సంచలన ప్రకటన తర్వాత.. ఆమెను రోజుకో వివాదం చుట్టుముడుతోంది. దేశంలోని దిగ్గజ సంస్థలు మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం), ఐసిఐసిఐ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్ సహా మరో మూడు కంపెనీలు మాధబి సంస్థతో ఆర్థిక లావాదేవీలు జరపడంతో ఆమెకు కోట్ల ఆదాయం సమకూరిందని మంగళవారం కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. మాధబి అగోరా ప్రైవేట్ లిమిటెడ్‌కు అక్రమ ఆదాయాలు సమకూరాయని సంచలన ఆరోపణలు చేసింది. సెబీ ఛైర్‌పర్సన్‌గా ఉంటునే ఆమె ఉద్దేశపూర్వకంగా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడ్డారని తెలిపింది. మాధబి 2017లో సెబీలో చేరగా.. 2022లో ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. 2019 నుంచి ఈ కంపెనీని తన భర్తే నిర్వహిస్తున్నారని మాధబి పేర్కొన్నప్పటికీ.. ఇప్పటికీ అందులో ఆమెకు వాటాలున్నాయని రిపోర్టులు వస్తున్నాయి.

"సెబీలో చేరిన తర్వాత తన సొంత అడ్వైజరీ కంపెనీ అగోరా కార్యకలాపాలు నిలిచిపోయినట్లు మాధబి తెలిపారు. కానీ ఆ సంస్థ సేవలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. 2016-2024 మధ్య రూ.2.95కోట్ల మేర ఆదాయం పొందింది. ఈ కంపెనీకి మహీంద్రా అండ్ మహీంద్రా, డాక్టర్ రెడ్డీస్, పిడిలైట్, ఐసిఐసిఐ బ్యాంక్, విసు లీజింగ్ అండ్ ఫైనాన్స్, సెంబ్‌కార్ప్ వంటివి క్లయింట్‌లుగా ఉన్నాయి. ఒక్క మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూప్ నుంచే ఆ కంపెనీకి రూ.2.59 కోట్ల ఆదాయం వచ్చింది. ఇది కచ్చితంగా సెబీ నిబంధనలను ఉల్లంఘించడమే. మహీంద్రా కంపెనీ నుంచి మాధబి భర్త దావల్ రూ.4.78కోట్ల మేర ఆదాయం పొందారు. మాధబి సెబీ బోర్డులో పూర్తిస్థాయి సభ్యురాలుగా ఉన్న సమయంలోనే ఆమె భర్త ఈ ఆదాయాన్ని అందుకున్నారు" అని కాంగ్రెస్ ఆరోపించింది. మాధబికి ముంబయిలో ఉన్న తన ప్రాపర్టీని సెబీ దర్యాప్తు చేస్తున్న ఓ సంస్థకు అద్దెకి ఇచ్చి.. లక్షల ఆదాయం పొందుతున్నారని ఇటీవల కాంగ్రెస్ వెల్లడించిన విషయం తెలిసిందే.



తిరుపతి జిల్లా పిచ్చాటూరు పిహెచ్‌సిలో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

జిఓ 85ను రద్దు చేయాల్సిందే

- రాష్ట్ర వ్యాప్తంగా పిహెచ్‌సి వైద్యుల నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

పిజి వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటా కుదిస్తూ తీసుకొచ్చిన జిఒ 85కి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (ఎపిపిహెచ్‌డి) వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ ఆఫీసర్స్‌కు మద్దతు తెలుపుతూ వైద్యులు, వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రజల కోసం కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవ చేసిన డాక్టర్లను ఆదరించాలన్నారు. గత రెండు నెలలుగా జిఒ 85ను రద్దు చేయాలని వినతులు ఇచ్చినా స్పందన లేదన్నారు. వెంటనే జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జిఒ కారణంగా తమ మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోతుందన్నారు. ఉన్నత చదువులకు గండిపడుతుందన్నారు. 16వ తేదీ వరకూ నిరసనలు తెలియజేస్తామని, 15న చలో విజయవాడ, 16 నుంచి నిరవధిక నిరాహారదీక్ష ప్రారంభం అవుతుందన్నారు.

తిరుపతి జిల్లా పిచ్చాటూరు, బుచినాయుడు కండ్రిగ, భీమవరం జిల్లా పెనుమంట్ర, గణపవరం, పిప్పర, ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా, అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేట, నక్కపల్లి మండలం గొడిచెర్ల, పార్వతీపురం మన్యం జిల్లా, కడప జిల్లా వేంపల్లె, చాపాడు పిహెచ్‌సిల వైద్యులు నిరసన తెలిపారు.

రిజర్వ్ ఫారెస్ట్‌లోనే చిరుత

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలోని దివాన్ చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతంలోనే ఇంకా చిరుత సంచరిస్తోంది. చిరుత సంచారాన్ని ట్రాప్ కెమెరాల్లో గుర్తించారు. ఈ మేరకు జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.భరణి తెలిపారు. రిజర్వ్ అటవీ ప్రాంతంలో చిరుత పులి పాదముద్రలను గుర్తించామని, ఈ చిరుత వల్ల ఇప్పటి వరకూ అటవీ, బయట ప్రాంతాల్లో మనుషులకు, పశువులకు ఎటువంటి హానీ జరగలేదని చెప్పారు. చిరుత కోసం బోనులు ఏర్పాటు చేశామని, చిరుత సంచారాన్ని బట్టి ట్రాప్ కెమెరాల అమరికను మార్పు చేశామని తెలిపారు. చిరుతను పట్టుకునేందుకు 50 మంది సిబ్బందితో తొమ్మిది బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ బృందాలు రాత్రి, పగలు గస్తీ నిర్వహిస్తున్నాయని తెలిపారు. చిరుతకు సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని కోరారు. చిరుత సంచారానికి సంబంధించిన సమాచారం అధికారికంగా తాము వెల్లడిస్తామని తెలిపారు.



వసాయి విరార్ సిటీ కార్పొరేషన్‌కు 40 ఓలెక్ట్రా బస్సులు

ప్రజాశక్తి - హైదరాబాద్

మహారాష్ట్రలోని వసాయి విరార్ సిటీ కార్పొరేషన్ (వివిసిఎంసి)కు 40 విద్యుత్ బస్సులను అందించినట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సంస్థ వెల్లడించింది. డిజైన్ ఖరారు చేసిన నెల రోజుల్లోపే వీటిని అందించినట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇది తమ సరఫరా చేసే సామర్థ్యాన్ని నిరూపించుకున్నట్లయ్యిందని పేర్కొంది. 2024 జనవరి 24న బస్సుల సరఫరాకు వివిసిఎంసితో ఒప్పందం చేసుకున్నట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ సిఎండి కెవి ప్రదీప్‌త ఎలిపారు. తమ గమనంలో ఇదో మైలు రాయి అని అన్నారు. ఈ 40 బస్సులు 4.2 కోట్ల కిలోమీటర్లకు పైగా ప్రయాణించి.. 93 లక్షల లీటర్ల డీజిల్‌ను ఆదా చేయడంతోపాటు 25,000 టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించనున్నాయన్నారు.



అంధుల కోసం తొలి బ్రైలీ ఎసి రిమోట్

- ఎల్‌జి ఆవిష్కరణ

న్యూఢిల్లీ : అంధుల కోసం పరిశ్రమలోనే తొలి సారి ఎసి రిమోట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ వెల్లడించింది. అంధులకు మద్దతునివ్వడానికి దీన్ని రూపొందించినట్లు ఆ సంస్థ ఉన్నతాధికారి యంగ్మిన్ హ్వాంగ్ తెలిపారు. దీంతో వారు ఎసి సులభంగా ఆపరేట్ చేయవచ్చని పేర్కొన్నారు. అంధుల సమాజానికి సాధికారత కల్పించే దిశగా తీసుకున్న చర్యకు ఇది నిదర్శనమని ఎల్‌జి ఇండియా ఎయిర్ కండీషనర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ చిత్కారా తెలిపారు.

ఏటా 32 వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్

- రూ.50 కోట్ల పెట్టుబడులు
- రీసస్టైయినిబిలిటీ, షార్ప్ వెంచర్స్ ఒప్పందం



హైదరాబాద్ : ప్రతీ ఏడాది 32,000 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయాలని నిర్దేశించుకున్నట్లు రీసస్టైయినిబిలిటీ (ఇంతక్రితం రాంకీ) వెల్లడించింది. ఇందుకోసం షార్ప్ వెంచర్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నటు రీసస్టైయినిబిలిటీ ఎండి, సిఇఒ మసూద్ మల్లిక్ తెలిపారు. దీనికి సంబంధించి మంగళవారం హైదరాబాద్‌లో షార్ప్ వెంచర్స్‌కు చెందిన మరికో లిమిటెడ్ ఛైర్మన్ హర్ష్ మారివాలాతో ఒప్పందం కుదర్చుకున్నారు. ఈ సందర్భంగా మసూద్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ పైలట్ ప్రాజెక్టును తొలుత హైదరాబాద్, చత్తీస్‌ఘడ్‌లోని రాయిపూర్‌లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకోసం తొలి దశలో రూ.50 కోట్లు పెట్టుబడులు పెడుతున్నామన్నారు. ప్రతీ ఏడాది 32వేల టన్నుల ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేయడం ద్వారా 15,000 టన్నుల కార్బన్‌డైఆక్సైడ్‌ను తగ్గించాలని నిర్దేశించుకున్నామన్నారు. కృత్రిమ మేథా (ఎఐ) టెక్నాలజీతో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్లలో రకరకాల ప్లాస్టిక్ వ్యర్థాలను నాణ్యతపరంగా వేరు చేయనున్నామని.. అనంతరం రీసైకిల్ చేయనున్నామన్నారు. వచ్చే మూడు నుంచి ఐదేళ్లలో రూ.100 కోట్ల పెట్టుబడులు చేయడం ద్వారా 10 లక్షల టన్నుల ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.



సింగపూర్‌లోనూ ఫోన్‌పే యుపిఐ సేవలు

న్యూఢిల్లీ : సింగపూర్‌లోను తన యుపిఐ చెల్లింపులను అందుబాటులోకి తెచ్చినట్లు ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే వెల్లడించింది. ఇందుకోసం అక్కడి లిక్విడ్ గ్రూప్‌తో తాము భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నామని ఫోన్‌పే మంగళవారం ప్రకటించింది. దీంతో భారతీయ సందర్శకుల ప్రధాన విహార కేంద్రమైన సింగపూర్‌లో విస్తారంగా ఉన్న లిక్విడ్ గ్రూప్ మర్చంట్ల వద్ద తమ వినియోగదారులు ఫోన్‌పే యాప్‌ను ఉపయోగించుకుని, స్కాన్ చేసి, చెల్లించేందుకు పర్యాటకులకు వీలు కల్పిస్తుందని ఫోన్ పే ఇంటర్నేషనల్ పేమెంట్ విభాగం హెడ్ రితేశ్ పాయ్ తెలిపారు.

బంధన్ ఎంఎఫ్ నుంచి బిజినెస్ సైకిల్ ఫండ్

న్యూఢిల్లీ : బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా బంధన్ బిజినెస్ సైకిల్ ఫండ్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఈ ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్‌కు సంబంధించిన న్యూఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఒ) మంగళవారం ప్రారంభమైందని.. సెప్టెంబర్ 24 వరకు తెరిచి ఉంటుందని వెల్లడించింది. ఇందులోని నిధులను విత్త, రియాల్టీ సహా ఇతర డైనమిక్ స్టాక్స్‌లో పెట్టుబడులుగా పెట్టనున్నట్లు పేర్కొంది. నిఫ్టీ 500 ఇండెక్స్‌పై దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపింది.

సంపాదకీయం

నయా చరితకు నాంది!

కృషితో నాస్తి దుర్భిక్షమ్ అన్న నానుడిని పారిస్ పారాలింపిక్స్‌లో మన క్రీడాకారులు నిరూపించారు. వైకల్యాన్ని అధిగమించి, పరిహాసాలను పారదోలి పట్టుదలతో అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన భారత క్రీడాకారులకు జేజేలు. ఇదివరకెన్నడూ లేనివిధంగా మూడు పదులకు చేరువగా పతకాలను సాధించి కొత్త చరిత్ర సృష్టించారు. దీనికి ముందు ఇదే వేదికపై జరిగిన సమ్మర్ ఒలింపిక్స్‌లో ఆశించిన రీతిలో రాణించలేకపోయామే అన్న బాధ నుంచి ఇది కొంత ఊరటనిచ్చింది. ఏడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, 13 కాంస్యాలతో మొత్తం 29 పతకాలతో పతకాల పట్టికలో భారత్ 18వ స్థానంలో నిలవడం గొప్ప విషయమే. ఇప్పటివరకు జరిగిన పారాలింపిక్ క్రీడల్లో భారత్ మొత్తంగా 60 పతకాలు సాధిస్తే.. ఈ ఒక్క పారాలింపిక్స్‌లోనే సగానికి పైగా పతకాలు రావడం విశేషం. దాదాపు రెండు వారాల పాటు జరిగిన ఈ పోటీల్లో 549 పతక ఈవెంట్లలో ప్రపంచ నలుమూలల నుండి వచ్చిన 4,400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 84 మందితో కూడిన భారత క్రీడా బృందం 12 క్రీడాంశాల్లో పాల్గొని పతకాల పంట పండించింది.

ఓవరాల్‌గా చూసినప్పుడు చైనా తన తిరుగులేని ఆధిక్యతను ఈసారి కూడా కొనసాగించింది. టోక్యో పారాలింపిక్స్‌లో మాదిరిగానే 94 స్వర్ణాలు సహా 220 పతకాలు సాధించి నెంబర్ వన్ స్థానంలో అది నిలవగా, 49 స్వర్ణాలు సహా 124 పతకాలతో బ్రిటన్ ద్వితీయ స్థానంలోను, 105 పతకాలతో అమెరికా తృతీయ స్థానంలోనూ నిలిచాయి. 1972లో తొలి భారత పారాలింపిక్ విజేతగా మురళీకాంత్ పేట్కర్, తొలి మహిళా పారాలింపియన్‌గా 1984లో మాలతీ కృష్ణమూర్తి హోల్లా నిలిచారు. ఆ తరువాత మరో ముగ్గురు మహిళలు మాత్రమే అటువంటి గౌరవాన్ని పొందారు. ప్రస్తుత పారిస్ పారాలింపిక్స్‌లో ఏకంగా 10 మంది మహిళలు పతకాలు సాధించి శెభాష్ అనిపించుకున్నారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్‌లో స్వర్ణంతో ఇప్పటికి రెండు పారాలింపిక్ స్వర్ణాలు గెలిచిన అవని మినహా మిగిలిన తొమ్మిదిమంది తొలిసారి విజయ దుందుభి మోగించిన వారే. రెండు చేతులు లేకున్నా, కాలితోనే బాణం సంధించే జమ్ము కాశ్మీర్‌కు చెందిన 17 ఏళ్ల శీతల్‌దేవి రాకేశ్‌కుమార్‌తో కలిసి మిక్స్‌డ్ ఈవెంట్‌లో కాంస్యం సాధించడంతోపాటు, చిన్న వయసులో పారాలింపిక్స్‌లో పతకం దక్కించుకున్న భారత ఆర్చర్‌గా అరుదైన రికార్డును నెలకొల్పింది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన తెలుగమ్మాయి దీప్తి జివాంజి 400 మీటర్ల పరుగులో కాంస్యం సాధించి, మానసిక వైకల్యం తన లక్ష్యాన్ని ఆపలేదని నిరూపించింది. తల్లిదండ్రుల త్యాగాన్ని గుర్తుంచుకుని తన కోసం అమ్మేసిన స్థలాన్ని కొని వారికి కానుకగా ఇచ్చింది. అవమానాలను అధిగమించి 100, 200 మీటర్లలో రాణి ప్రీతిపాల్ రెండు కాంస్యాలు సాధించింది.

ఇప్పటికే పేరున్న జావలిన్ త్రోయర్ సుమిత్ ఆంటిల్, హై జంపర్ మారియప్పన్ తంగవేలు లాంటి వారితోపాటు కొత్తగా సత్తా చాటిన క్రీడా అణిముత్యాలెందరో ఉన్నారు. పొట్టికాలుతో పుట్టి అవహేళనను ఎదుర్కొన్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ 3 నెలల క్రితం గజ్జల్లో గాయంతో వైదొలిగే పరిస్థితి ఎదురైనా... మొక్కవోని దీక్షతో పోరాడి హైజంప్‌లో స్వర్ణాన్ని సాధించాడు. టోక్యోలో రజతం సాధించిన ప్రవీణ్ ఇప్పుడు రెట్టించిన పట్టుదలతో పోరాడాడు. మరుగుజ్జుగా అవమానాలెదుర్కొన్న హర్యానాకు చెందిన నవదీప్‌సింగ్ జావెలిన్ త్రోలో స్వర్ణం సాధించాడు. కాళ్లలో సమస్యతో సరిగ్గా నిలబడలేని హర్యానాకు చెందిన హర్విందర్ ఎకనామిక్స్‌లో పిహెచ్‌డి చేస్తూనే ఆర్చరీలో స్వర్ణం సాధించాడు. రైలు ప్రమాదంలో కాలుకోల్పోయిన నితేష్‌కుమార్ కృత్రిమ పాదంతో బ్యాడ్మింటన్ ఆడి, నాలుగు పదుల వయసులో పసిడి కల నెరవేర్చుకున్నాడు. ఉగ్రవాదులు పేల్చిన మందుపాతరకు పాదం కోల్పోయిన నాగాలాండ్‌కు చెందిన ఆర్మీ మాజీ హవాల్దార్ హొకాటో హొటోజీ సెమా షాట్‌పుట్‌లో కాంస్యం సాధించాడు. సుమిత్ అంటిల్ జావిలిన్ త్రోలో వరుసగా రెండోసారి స్వర్ణాన్ని అందుకున్నాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన టాక్సీ డ్రైవర్ తనయుడు కపిల్ పర్మార్ అంధుల జూడోలో కాంస్యంతో సత్తా చాటాడు.

సమ్మర్ ఒలింపిక్స్ కుస్తీపోటీల ఫైనల్లో వినేష్ ఫొగాట్‌పై అనర్హత వేటు వేయడం వెనక ఉన్న కుత్సిత రాజకీయాలకు పారాలింపిక్స్ దూరంగా ఉండటం కొంత ఊరటనిచ్చింది. వికలాంగుల సంక్షేమం కోసం చేస్తున్న చట్టాలు క్షేత్రస్థాయిలో చట్టుబండలవుతున్నా స్వయంకృషితో వారు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తుండడం ముదావహం. వికలాంగులకు తగినంత ప్రోత్సాహమిస్తే మరిన్ని అద్భుతాలు సాధిస్తారు. 2028 లాస్ ఏంజిల్స్ పారాలింపిక్స్‌కు ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో క్రీడాకారులను సిద్ధం చేయాల్సిన అవసరమెంతైనా ఉంది.

మహనీయుల మాట



ఒక దేశం అనేకానేక కుటుంబాల సమాహారం. ఇంట్లో న్యాయం, సమానత్వం సాధించకుండా అవి ప్రజా జీవితంలో మాత్రం వుండాలని ఆశించలేము. ఇంట్లో అణచివేతకు పాల్పడే పురుషుడు వీధిలోకో, చట్టసభల్లోకో, న్యాయస్థానాల్లోకో వచ్చేసరికి హఠాత్తుగా మారిపోయి సాధువు కాలేడు.

- సుబ్రమణ్య భారతి,
రచయిత, సంఘసంస్కర్త.

వరద బాధిత ప్రజలను ఆదుకోండి

సమస్య

ముఖ్యమంత్రికి సిపిఎం మెమొరాండం

కృష్ణా నదికి, బుడమేరు వాగుకు వరదల మూలంగా ప్రధానంగా విజయవాడ నగరం, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అపార నష్టం సంభవించింది. గడిచిన వారం రోజులుగా ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఆ తరువాత గోదావరి నది, కొల్లేరు ప్రాంతం, అదే విధంగా ఇప్పుడు అల్లూరి సీతారామరాజు జిల్లా, ఉత్తరాంధ్ర భారీ వర్షాలు, ముంపు ముప్పులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బాధిత ప్రజలను ఆదుకునేందుకు తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

(1) కేంద్ర ప్రభుత్వం ఈ వరదను జాతీయ విపత్తుగా ప్రకటించాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలి.

(2) కేంద్రం తక్షణ సాయంగా పది వేల కోట్ల రూపాయలు విడుదల చేయాలి, నివేదికల అనంతరం పూర్తి సహాయం ఇవ్వాలి, అన్ని విధాల రాష్ట్రాన్ని ఆదుకోవాలి.

(3) రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి.

(4) వరదల్లోను, వర్షాలకు కొండ చరియలు విరిగిపడి మతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి. వరద ముంపునకు గురైన ప్రతి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.25 వేలు ఇవ్వాలి. అంచనాలు అనంతరం పూర్తి సహాయం లక్షకు తగ్గకుండా ఇవ్వాలి.

(5) దెబ్బతిన్న ఇళ్ల మరమ్మతులకు ఆర్థిక సహాయం రూ.2 లక్షలు అందించాలి, పూర్తిగా దెబ్బతిన్న వాటికి రూ.5 లక్షలు ఇచ్చి పునర్నిర్మించాలి.

(6) ప్రతి కుటుంబానికి నిత్యావసర సరుకులు, పాత్రలు, బట్టలు, మంచాలు ఇవ్వాలి.

(7) ఆగస్టు, సెప్టెంబర్ నెల విద్యుత్ బిల్లులు రద్దు చేయాలి.

(8) 2024-25 ఇంటి పన్నులు, మంచి నీరు, డ్రైనేజీ ఇతర యూజర్ చార్జీలను రద్దు చేయాలి.

(9) ప్రభుత్వ బ్యాంకులు, ప్రైవేటు ఆర్థిక సంస్థలు రెండు నెలల ఈఎంఐలు రద్దు చేయాలి, మిగిలిన ఈఎంఐలను సంవత్సరం పాటు వాయిదా వేయాలి.

(10) ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలకు, ఇతర వాహనాలకు జరిగిన నష్టానికి అవసరమైతే నిబంధనలు సడలించి ఇన్సూరెన్స్ కంపెనీలు పూర్తి పరిహారమివ్వాలి. ఇన్సూరెన్స్ లేని వాహనాల పునరుద్ధరణకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలి.



(11) చిన్న, మధ్యతరగతి వ్యాపారులు, పరిశ్రమలు, సంస్థలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి అన్ని విధాల ఆదుకోవాలి. రుణాలు చెల్లింపు వాయిదా వేసి, సబ్సిడీతో కొత్త రుణాలు ఇవ్వాలి, ఇన్సూరెన్స్ కంపెనీలు నిబంధనలు సడలించి పూర్తి పరిహారం ఇవ్వాలి.

(12) బ్యాంకులు లక్ష రూపాయలకు తగ్గకుండా వడ్డీ లేని వినిమయ రుణాలు ఇవ్వాలి.

(13) విద్యార్థుల సర్టిఫికెట్లు, పట్టాలు, ప్రజల గుర్తింపు కార్డులు కోల్పోయిన వారికి ప్రభుత్వ బాధ్యతగా ఆయా డిపార్టుమెంట్ల నుండి తక్షణం ఇప్పించాలి.

(14) నిండిపోయిన మరుగుదొడ్లను శుభ్రం చేయించాలి. మహిళలకు శానిటరీ నాప్‌కిన్స్ ఇవ్వాలి. ఇతర అవసరాలు తీర్చాలి.

(15) వరద ప్రాంతాల్లో బ్యాంకులు పంట రుణాలు రద్దు చేయాలి. కొత్తగా రుణమివ్వాలి. ప్రయివేటు అప్పుల చెల్లింపు సంవత్సరం పాటు వాయిదా వేయించాలి. వడ్డీ మాఫీ చేయించాలి. పంటల బీమా చెల్లించాలి.

(16) నష్టపోయిన పంటలకు వ్యవసాయ ఖర్చులు లెక్కించి ఆయా పంటల వారీగా నష్టపరిహారం ఇవ్వాలి. ప్రత్యామ్నాయ పంటలకు సబ్సిడీతో విత్తనాలివ్వాలి. డ్వాక్రా, పొదుపు సంఘాలు, రైతులు, చిరు వ్యాపారులు, వృత్తిదారుల రుణాలు మాఫీ చేయాలి.

(17) పంట నష్టపోయిన కౌలు రైతులకు గ్రామ సభల ద్వారా గుర్తించి పంట నష్టపరిహారం, బ్యాంకులు పంట రుణాలు, రబీ పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి.

(18) వ్యవసాయ కార్మికులకు తక్షణమే ఉపాధిహామీ పనులు చేపట్టాలి. ముంపుకు గురైన పేదలందరికీ కుటుంబానికి రూ.10 వేలు నగదు, మూడు నెలలపాటు ఆహార ధాన్యాలు ఉచితంగా ఇవ్వాలి.

(19) గొర్రెలు, మేకలు, పశువులకు ఇన్సూరెన్సు, క్లెయిమ్స్ త్వరగా పరిష్కరించాలి. పశు దాణా ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలి.

(20) చేతి మగ్గాలు, ఇతర వృత్తిదారులకు జరిగిన నష్టాన్ని ఎన్యూమరేట్ చేసి తగు పరిహారమివ్వాలి.

(21) బుడమేరు శాశ్వత ముంపు నివారణ చర్యలు చేపట్టాలి. బుడమేరు ప్రవాహానికి అడ్డంకులను తొలగించాలి.

(22) కష్ణానది కరకట్ట వాల్‌ను బలోపేతం చేయాలి. రిటైనింగ్ వాల్ నుండి డ్రైనేజీ నీటి కొరకు ఉన్న ఖాళీల నుండి వరద నీరు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

(23) దెబ్బతిన్న గ్యాస్ స్టవ్‌ల స్థానే కొత్తవి ఇవ్వాలి. సిలిండర్లు పోయిన వారికి కొత్త సిలిండర్లు ఇవ్వాలి, ఒక సిలిండర్ నింపి ఉచితంగా ఇవ్వాలి.

(24) ప్రతి ఇంటిలోని వ్యర్థాలు తొలగించటానికి తగు ఏర్పాట్లు చేయాలి.

(25) రాకపోకలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలి.

(26) సాధారణ పరిస్థితి ఏర్పడే వరకు ప్రాంతాలవారీగా భోజన కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

(27) టీవీలు, ఫ్రిజ్‌లు, నీటి మోటార్లు, వాషింగ్ మిషన్లు, వాహనాలు రిపేర్లు ఉచితంగా చేయడానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

(28 పెండింగ్‌లో ఉన్న పెన్షన్ తక్షణమే పంపిణీ చేయాలి.

(29) ప్రతి ఇంటిలో దెబ్బతిన్న వైరింగ్ తొలగించి కొత్త వైరింగ్‌తో విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించాలి.

(30) ప్రతి ఇంటికి మంచినీటి మోటర్ ఉచితంగా ఇవ్వాలి. కుటుంబానికి రోజూ 20 లీటర్ల మంచినీరు సప్లై చేయాలి.

(31) ముంపునకు గురైన ప్రభుత్వ, వివిధ సంస్థల ఉద్యోగులకు 15 రోజులు పాటు జీతంతో కూడిన సెలవులు ఇవ్వాలి.

(32) రోడ్లు, డ్రైన్లు మరమ్మతులు తక్షణం చేపట్టాలి.

(33) దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలి, వీధి లైట్లు అన్నీ పునరుద్ధరించాలి.

(34) వ్యాధులు ప్రబలకుండా, వైద్య సౌకర్యాల కోసం ప్రతి వార్డుకు, గ్రామానికి ఒక ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి.

(35) వరద పీడిత ప్రాంతాలలో అన్ని రకాల వైద్యులతో ప్రత్యేక ఆసుపత్రులు ఏర్పాటు చేయాలి, పిహెచ్‌సిలు ఉన్న ఆసుపత్రులలో అన్ని సౌకర్యాలు కల్పించాలి, అంబులెన్సులు, జనరేటర్లు ఏర్పాటు చేయాలి.

(36) కొండ ప్రాంతాల్లో నివాస ప్రాంతాల అభివృద్ధికి, రక్షణకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి, ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి.

(37) స్కూలు, కాలేజీ విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, ఇతర సామగ్రి ఉచితంగా ఇవ్వాలి.

(38) అన్ని ప్రైవేటు స్కూలు, కాలేజీలకు ఫీజులు రద్దు చేయాలి. పేద, మధ్యతరగతి వారి పిల్లలకు ప్రభుత్వమే ఆ ఫీజులు చెల్లించాలి.

(39) ముంపు బాధితులైన మునిసిపల్, స్కీమ్ వర్కర్లు విధులకు హాజరు కావాలని అధికార్లు ఒత్తిడి చేస్తున్నారు. వారికి మినహాయింపునిచ్చి 15 రోజులపాటు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి. ●

సందర్భం

అడవుల పరిరక్షణకు మనం సైతం...

అడవులు భూమాతకు ఊపిరితిత్తులుగా అమూల్య సేవలందిస్తూనే, గాలిని శుద్ధి చేస్తూ, జీవులన్నింటికీ ప్రాణ వాయువును అందిస్తూ, వాతావరణ సానుకూల మార్పులకు జీవం పోస్తూ, జీవ కోటి మనుగడకు అమూల్య పునాదులు వేస్తున్నాయి. 10-20 ఏళ్ల క్రితం నువ్వు నాటిన చెట్టును చూస్తూ గర్వించడం నేర్చుకొని ప్రతి ఏటా మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు భుజాన వేసుకోవడం మన జీవనశైలిలో భాగం కావాలి. కనీస బాధ్యతగా తీసుకోవాలి. పర్యావరణం విచ్ఛిన్నమైతే జీవకోటి సర్వనాశనం అవుతుందని గుర్తుంచుకోవాలి. భూమాత తనపై రాసుకున్న కవిత శీర్షిక 'అటవీ మాత' అని అర్థం చేసుకోవాలి. రేపటి ఆశావహ జీవనానికి నేడు ఓ మొక్కను నాటే అలవాటు చేసుకోవాలి. ఏ జాతి తన నేల మట్టిని నిర్లక్ష్యం చేస్తుందో ఆ పౌర సమాజం మట్టిలో కలవడం ఖాయమని తెలుసుకోవాలి.

1730 ఖేజర్లీ ఊచకోత

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో 1730 సెప్టెంబర్ 11న నాటి మహారాజు ఆదేశాలతో అడవిలోని ఖేజ్రీ చెట్లను నరకడాన్ని ఖేజర్లీ గ్రామస్థులు శాంతియుతంగా వ్యతిరేకించారు. వారిపై విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో 363 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ "ఖేజర్లీ ఊచకోత"కు నిరసనగా సెప్టెంబర్ 11న దేశవ్యాప్తంగా "జాతీయ అటవీ అమరవీరుల దినం" పాటిస్తున్నాం. ఈ ఊచకోత దుర్ఘటన తర్వాత ఇరవయ్యవ శతాబ్దంలో సుందర్ లాల్ బహుగుణ నేతృత్వంలో 'చిప్కో ఉద్యమం' ప్రారంభమైంది. అడవుల్లో కలప, గంధం చెక్కలు, వన్య ప్రాణుల వేట, అటవీ భూముల దురాక్రమణ లాంటి సందర్భాల్లో విధులు నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బందితో పాటు వ్యతిరేకించే పర్యావరణ ప్రేమికుల పట్ల స్మగ్లర్లు/వేటగాళ్లు కాల్పులు, దాడులు చేసి గాయపరచడం, ప్రాణాలు సహితం తీయడం అనాదిగా, అమానవీయంగా కొనసాగుతున్నది.



జాతీయ అటవీ అమరవీరుల దినం వేదికగా ప్రతి ఏటా మొక్కలు నాటడం, నాటిన మొక్కలు/చెట్లను పరిరక్షించుకోవడం, విద్యాలయాల్లో హరిత హిత సదస్సులు/కార్యశాలలు/వన్యప్రాణుల సంరక్షణ సమావేశాలు ఏర్పాటు చేయడం, అటవీ పరిరక్షణలో ప్రాణ త్యాగం చేసిన కుటుంబాలకు చేయూత ఇవ్వడం, అటవీ అంశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అడవులను శుద్ధి చేయడం, పర్యావరణ సంస్థలకు చేయూత ఇవ్వడం, అటవీ రక్షణలో సుస్థిరాభివృద్ధి కార్యాచరణ అమలు చేయడం, అటవీ సంరక్షణ కేంద్రంగా డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిలిమ్ వీడియోల ద్వారా ప్రచారం చేయడం, అటవీ సంరక్షకుల కథనాలు చదివి ప్రేరణ పొందడం, సమీప అడవులకు వెళ్లి వన్య ప్రాణులు, వృక్షజాతుల అందాలు ఆస్వాదించడం లాంటి పలు కార్యక్రమాలు చేపట్టాలి.

ప్రపంచ దేశాలతో పోల్చితే భారత్‌లో అటవీ సంపద సంరక్షణలో అటవీ ఉద్యోగుల మరణాలు అధికంగా నమోదు అవుతున్నాయి. 2012-17 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా 536 మంది మరణించగా అందులో 162 మంది భారతీయ ఫారెస్ట్ రేంజర్లు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. ఇదే తరహాలో కాంగో (51 మంది), థాయ్‌లాండ్(37), కెన్యా(32), యూఎస్ఏ (25), సౌత్ ఆఫ్రికా(18 మంది) దేశాల్లో కూడా అధికంగా అటవీ శాఖ ఉద్యోగులు అధికంగా ప్రాణాలు కోల్పోతున్నారని గణాంకాలు వివరిస్తున్నాయి.

ఆరోగ్యకర పౌర సమాజానికి పరిశుద్ధ ప్రాణ వాయువు అవసరమని, ప్రాణ వాయువును అడగకుండానే ఉచితంగా బహూకరిస్తున్న హరిత అడవుల పట్ల సంపూర్ణ గౌరవాన్ని కలిగి ఉన్న సమాజమే భవిష్యత్తులో మనుగడ సాధించగలదని గమనించాలి. అడవులు మన శ్రేయోభిలాషులని, సకల జీవరాసుల మేలు కలయికతో జీవవైవిధ్యం నెలకొనడానికి హరిత వనాలు ఉపకరిస్తున్నాయని తెలుసుకుందాం. మన ఉజ్వల భవితను మనమే లిఖించుకుందాం.

-డా॥ బుర్ర మధుసూదన్‌రెడ్డి,
సెల్: 9949700037

హేమ కమిటీ నివేదిక

మహిళల పోరాటంలో ఓ మైలురాయి...

విశ్లేషణ


కేరళ సినీ పరిశ్రమను పూర్తిగా కుదిపివేసిన హేమ కమిటీ నివేదిక యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచింది. కోల్‌కతా, తమిళనాడు వంటి వివిధ ప్రాంతాలకు చెందిన అనేక మంది కళాకారులు హేమ కమిటీ వంటి కమిటీలను ఇతర రాష్ట్రాల్లో ఎందుకు ఏర్పాటు చేయలేదనే ప్రశ్నలను లేవనెత్తారు. ఇది న్యాయమైన ప్రశ్న. మహిళలపై ఈ తరహా దోపిడీ బాలీవుడ్ మొదలుకొని సినీ పరిశ్రమ అంతటిలో వుందనేది బహిరంగ రహస్యం. కానీ ఈ రంగాన్ని శాసించే శక్తులు మహిళల గొంతు నొక్కేస్తున్నాయి.



బృందా కరత్

సినిమా పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు 'ఉమెన్ సినిమా కలెక్టివ్' (డబ్ల్యుసిసి) ని ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం కేరళ. తమ సహోద్యోగుల్లో ఒకరికి ప్రముఖ నటుడి చేతిలో చేదు అనుభవం ఎదురైన నేపథ్యంలో ఈ సంస్థ ఏర్పడింది. పినరయి విజయన్ నేతృత్వంలోని వామపక్ష ప్రజాస్వామ్య ప్రభుత్వం కూడా సంస్థకు గొప్ప మద్దతునిచ్చింది. తమ ప్రాంతంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను డబ్ల్యు.సి.సి సభ్యులు లేవనెత్తడంతో వామపక్ష ప్రభుత్వం ఆ సమస్యను అధ్యయనం చేసి పరిష్కరించేందుకు జస్టిస్ హేమ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది.

పితృస్వామ్యంతో పాతుకుపోయిన ఏ సమాజంలోనైనా ప్రగతిశీల మార్పునకు నాంది పలికేది మహిళలే. భారత దేశంలో మహిళా సంఘాలు, ఉద్యమాల చరిత్ర కూడా ఇదే. మహిళల పట్ల సానుభూతి చూపే, వారి సమస్యలను వినే ప్రభుత్వం...డబ్ల్యు.సి.సి వంటి ఉద్యమానికి ఎంతగానో తోడ్పడింది. మహిళా ఉద్యమం, రాజకీయ శక్తులు చేతులు కలిపితే పితృస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా గట్టి అడుగు పడుతుంది. సామాజిక మార్పు కోసం మహిళలు చేస్తున్న పోరాటాల్లో వామపక్షాలు శక్తివంతమైన మిత్రపక్షంగా ఉన్నాయి. కేరళలో వామపక్ష ప్రభుత్వం ఉంది. మహిళలపై దోపిడీని నిరోధించడానికి, అవసరమైన అన్ని రకాల రక్షణలకు అది



కట్టుబడి ఉంది. హేమ కమిటీ ఏర్పాటు, ఆ తర్వాత ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నియామకం అందుకు అద్దం పడుతోంది.

సినీ పరిశ్రమను శాసించే శక్తులపైన, లైంగిక దోపిడీ, లాబీలకు సంబంధించిన అంశాలపైన హేమ కమిటీ నివేదిక దృష్టి సారించింది. మహిళా కళాకారులు అత్యంత అరక్షిత పని పరిస్థితులలో, విశ్రాంతి గదులు కూడా లేకుండా, ఎటువంటి ఒప్పందాలు లేకుండా పని చేయాల్సి ఉంటుంది. హేమ కమిటీ నివేదిక ప్రకారం, పరిశ్రమలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అనేక సంఘాలు సినీ రంగంలో ఉన్నాయి. అయితే వాటిలో చాలా వరకు నమోదు కాలేదు. అనేక సంఘాలు ఎవరి కోసం నిలబడాలో వారినే దోపిడీ చేస్తున్నాయని తేలింది. అటువంటి సంస్థలన్నిటినీ రిజిస్టర్ చేసి, వాటి కార్యకలాపాలన్నిటినీ చలన చిత్ర పరిశ్రమ నియమ నిబంధనల పరిధిలోకి తీసుకు రావాలని హేమ కమిటీ సిఫారసు చేసింది.

ఫిల్మ్ అసోసియేషన్ 'అమ్మ' సంస్థ సభ్యులను ఎంపిక చేయడంలో కూడా వివక్ష చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. హేమ కమిటీ నివేదిక వెలువడ్డాక...ఆ సంస్థ పని తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం కావడంతో సంస్థకు చెందిన మొత్తం ఆఫీస్ బేరర్లు రాజీనామా చేయాల్సి వచ్చింది.

సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులకు గురవుతున్న మహిళలు ఫిర్యాదు చేసేందుకు 'సిట్'ను ఏర్పాటు చేసి ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం ఆదర్శప్రాయమైన చర్య తీసుకుంది. వేధింపులు జరిగి ఎంత కాలమైనా ఫిర్యాదు చేయడానికి ఎలాంటి పరిమితి లేదు. బెంగాల్ కళాకారులు సహా అనేకమంది 'సిట్'కు ఫిర్యాదులు చేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి బహిరంగంగా మాట్లాడారు. మహిళకు తాను ఎదుర్కొన్న వేధింపుల గురించి మాట్లాడాలంటే ధైర్యం కావాలి. అయితే, మహిళలు ఫిర్యాదులు చేయనారంభించినప్పుడు, నిందితులు కూడా వాటిపై తిరుగు ఫిర్యాదులు చేశారు. ఇది పితృస్వామ్య సమాజంలోని సమస్య. తమను తాము సమర్థించుకోవడానికి చాలా మంది నుండి ఇలాంటి స్పందనలు రావడం సహజం.

సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులకు గురవుతున్న మహిళలు ఫిర్యాదు చేసేందుకు 'సిట్'ను ఏర్పాటు చేసి ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం ఆదర్శప్రాయమైన చర్య తీసుకుంది. వేధింపులు జరిగి ఎంత కాలమైనా ఫిర్యాదు చేయడానికి ఎలాంటి పరిమితి లేదు. బెంగాల్ కళాకారులు సహా అనేకమంది 'సిట్'కు ఫిర్యాదులు చేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి బహిరంగంగా మాట్లాడారు. మహిళకు తాను ఎదుర్కొన్న వేధింపుల గురించి మాట్లాడాలంటే ధైర్యం కావాలి. అయితే, మహిళలు ఫిర్యాదులు చేయనారంభించినప్పుడు, నిందితులు కూడా వాటిపై తిరుగు ఫిర్యాదులు చేశారు. ఇది పితృస్వామ్య సమాజంలోని సమస్య. తమను తాము సమర్థించుకోవడానికి చాలా మంది నుండి ఇలాంటి స్పందనలు రావడం సహజం.

న్యాయం కోసం పోరాడుతున్న వారి పక్షాన వున్నామని ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. కాబట్టి మహిళా ఫిర్యాదుదారులకు రక్షణ కల్పించేందుకు, రౌడీలపై చర్యలు తీసుకునేందుకు 'సిట్' అవసరమైన చర్యలు తీసుకుంటుందనడంలో సందేహం లేదు. మహిళలు మాట్లాడితే తప్ప సమాజం మారదు. కాబట్టి దాడి చేసిన వారి పేర్లను బహిర్గతం చేయడమనేది బాధితుల రక్షణకు ఉపయోగపడుతుంది.

హేమ కమిటీ నివేదిక ప్రచురణకు సంబంధించిన అన్ని సమస్యలను అధిగమించడానికి ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేసింది. అంతేగాక అవసరమైన చట్టపరమైన చర్యలను తీసుకుంది. అయితే కేరళలోని కాంగ్రెస్ పార్టీకి దీనికి సబంధించి ఒకే ఒక ఎజెండా ఉంది. అదేమంటే ప్రభుత్వ ప్రయత్నాలను ఏదోక విధంగా అడ్డుకోవడమే. సినీ పరిశ్రమలో మహిళల న్యాయ పోరాటానికి ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం మద్దతుగా నిలిచినప్పుడు, అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రక్షించే పార్టీగా కాంగ్రెస్ మారింది. మీడియాలోని కమ్యూనిస్టులకు వ్యతిరేకమైన ఓ వర్గం వారికి మద్దతు ఇస్తున్న పరిస్థితి నెలకొంది. దర్యాప్తు బృందానికి అందిన ఫిర్యాదు ఆధారంగా సిపిఎం ఎమ్మెల్యే ముఖేష్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం నిందితులను కాపాడుతోందన్న కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలను తోసిపుచ్చింది.

ఇలాంటి విషయాల్లో 'వారు చేశారు కాబట్టి మేం చేశాం' అనే ధోరణి ఉండకూడదు. ప్రతి చోటా మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడంపై దృష్టి సారించాలి. హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో-సినీ పరిశ్రమలో జరుగుతున్న అన్యాయాలపై ధైర్యంగా పోరాడేందుకు ప్రభుత్వం, సమాజం తమకు తోడుగా నిలుస్తున్నాయని మహిళలు విశ్వసించాలి.

కేరళకు ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం. న్యాయ పోరాటంలో హేమ కమిటీ నివేదిక మరో మైలు రాయి వంటిది. ఇందుకు అండగా నిలిచిన మహిళలకు అభినందనలు. మహిళలు చెప్పింది వింటూ వారికి మరింత బలాన్ని ఇచ్చినందుకు కేరళ వామపక్ష ప్రభుత్వానికి ధన్యవాదాలు.

/ వ్యాసకర్త సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు /

Form No. 3
(See Regulation-15 (1)(a)]/16(3)
DEBTS RECOVERY TRIBUNAL VISHAKHAPATNAM
Ground & 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam- 530020
Case No.: O.A. No. 529 of 2020
Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.
ICICI Bank Limited
AND
Sri Bandaru Rajesh and Others

To,
1) Bandaru Rajesh, S/o B.S.P.B. Sriranga Raju, D. No: 1-20A, Edepalli, Alluru, Krishna District, Andhra Pradesh- 521343 and others.
2) M/s. Nexus Feeds Ltd., Represented by Managing Director, Mr. G. Ramakrishna Reddy, S/o Satyanarayana Reddy, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali- 534237, West Godavari District.
3) G. Ramakrishna Reddy, S/o Satyanarayana Reddy, R. No: 223/2B, Opp: Saibaba Temple, Seesali-534237, West Godavari District.
4) Mr. G. Venkata Reddy, S/o Satyanarayana Reddy, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali-534237, West Godavari District.
5) G. Srirama Reddy, S/o Satyanarayana Reddy, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali-534237, West Godavari District.
6) Goluguri Radha, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali-534237, West Godavari District.
7) Venkata Subrahmanyan Voleti, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali-534237, West Godavari District.
8) Mr. Suryanarayana Vankadaru R.No. 223/2B, Opp: Saibaba Temple, Seesali- 534237, West Godavari District.
9) Pitani Srinivasa Rao, S/o Krishna, D.No. 1-94, Mulaupara Gudem, Pedalanka, Krishna District- 521344.
10) Bokka Srinivasa Rao, S/o Ramakrishna, D.No. 9-37, Mulalanka, Pedalanka, Krishna District- 521344.
11) Bokka Vinayaka, S/o Satyanarayana, D. No. 10-45/1, Mulalanka, Kalidindi, Krishna District- 521344.
12) Gudala Pavani,W/o Nagaraju, D. No.9-90/2, Kukkalavaripalem, Kodamanchili, West Godavari- 534269.
13) Jakkamsetti Srinu, S/o Venkata Rao, D. No. 1/151B, Mulalanka, Mulauppara Gudam, Pedalanka, Krishna District- 521344.
14) J.T.R Satyanarayana Prasad, S/o Radha Krishna Murthy, D. No. 10-1-49/2, Old Super Bazar Road, 9th Ward, Chinarangani Palem, Bhimavaram- 53420, West Godavari District.
15) Ketha Manikyala Rao, S/o Satyanarayana, D. No. 1-138-1, Mulauppara Gudem, Padamatipalem, Kalidindi, Krishna District- 521344.
16) Kilaparthi Nagaraju, S/o Appala Naidu, D. No. 4-8, Padamatipalem, Mulalanka, Kalidindi, Krishna District- 521344.
17) Mamidisetti Prasad, S/o Mahankali, D. No. 9-36, Satyanarayana Nagar, Mulalanka, Mulauppara Gudem, Pedalanka, Krishna District- 521344.
18) Namani Anjaneyulu, S/o Trimurthulu, D. No.1-105, Near Vanthena, Ramakrishnapuram, Mula Lanka, Kalidindi, Krishna District- 521344.
19) Nekkanti Ramesh, S/o Venkata Rao, D. No. 7-11-19, Narsapuram, West Godavari District.
20) Vempalli Srinivas, S/o Dharma Raju, D. No. 3-55, Arugolanu, Tadepalligudem, West Godavari- 534146.
21) Arumilli Venkateswara Rao, S/o Satyanarayana, Mulalanka, Peda Lanka, Kalidindi, Krishna District- 521344.
22) Bokka Jadalu, S/o Anjaneyulu, Mula Lanka, Pedalanka, Krishna District- 521344.
23) Karni Mohan Rao, S/o Venkanna, D.No. 2-121, Mulalanka, Kalidindi, Krishna District- 521344.
24) Karni Shyam Chinni, S/o Venkanna, D. No. 2-121, Mulalanka, Kalidindi, Krishna District-521344.
25) Mutyam Vijaya Raju, S/o Bhaskara Rao, D. No. 6-30, Kalla, West Godavari .
26) Sarela Peddi Raju, S/o Papa Rao, D. No. 2-130, Mulalanka, Kalidindi, Krishna District-521344.

SUMMONS BY WAY OF PAPER PUBLICATION
WHEREAS, OA/529/2020 was listed before Hon'ble Presiding Officer/Registrar on 27.09.2024.
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs. 75,07,911/- application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties:
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/ Registrar on 27.09.2024 at 10:30 A.M. failing the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date: 13/08/2024.

Signature of the Officer Authorized to issue summons
Assistant Registrar
Debts Recovery Tribunal Visakhapatnam


మొగల్‌రాజపురంలో ప్రభుత్వం సరఫరా చేస్తున్న కూరగాయల కోసం క్యూలైన్‌లో నిలబడిన వరద బాధితులు

సామాన్యుల బతుకుల్లో వరద కల్లోలం

- తుడిచిపెట్టుకుపోయిన వ్యాపారాలు
- కొనుగోలుకు చేసిన అప్పు తీరకముందే పాడైపోయిన గృహోపకరణాలు
- విజయవాడ ముంపు ప్రాంతాల్లో ఒక్కొక్కరిది ఒక్కో గాథ

విజయవాడ బుడమేరు ముంపు ప్రాంతాల్లో సామాన్యుల బతుకుల్లో వరద కల్లోలం రేపింది. అప్పులు చేసి లక్షలు, వేల రూపాయల పెట్టుబడితో పెట్టిన వ్యాపారాలు తుడిచిపెట్టుకుపోయాయి. ఇఎంఐలు తీరకముందే ఇళ్లల్లోని గృహోపకరణాలు, కుటుంబ పోషణకు తీసుకున్న వాహనాలు ఎందుకూ పనికిరాకుండాపోయాయి. వరద ముంపు ప్రాంతాల్లో ఒక్కొక్కరిది ఒక్కో వ్యధ. తమ కష్టనష్టాలను ప్రభుత్వం భర్తీ చేస్తేనే బతుకు బండి నడపగలమని బాధితులు వాపోతున్నారు. ఇళ్ల ఎన్యుమరేషన్ ప్రక్రియ సాగిస్తున్న బృందాలు... వ్యాపార నష్టాలను నిర్ధారించడానికి పూనుకోకపోవడంపై పలువురు ఆందోళన చెందుతున్నారు.

-ప్రజాశక్తి కృష్ణా ప్రతినిధి


దెబ్బతిన్న జనరిక్ మందుల షాపు
తడిసిపోయిన బియ్యం బస్తాలు

విజయవాడ వన్‌టౌన్ ఊర్మిళానగర్‌కు చెందిన సింగశెట్టి వెంకట లక్ష్మణరావు... అజిత్‌సింగ్ నగర్ పైపుల రోడ్డులోని తిరుపలశెట్టి కాంప్లెక్స్‌లో ఆరేళ్ల క్రితం హర్షవర్ధన రైస్ అండ్ జనరల్ స్టోర్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ దుకాణంపై రూ.5 లక్షలు బ్యాంకు అప్పు తీసుకుని విస్తరించారు. రోజుకు సగటున 15 వేల టర్నోవర్‌తో దానిని నడుపుతున్నారు. ఇదే కాంప్లెక్స్‌లోనే బియ్యం దుకాణం పక్కన అజిత్‌సింగ్ నగర్ ప్రాంతానికి చెందిన నమ్మి శ్రావణ్‌కుమార్ నాలుగేళ్ల క్రితం జనతా జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటు చేసుకున్నారు. రోజుకు రూ.7 వేల టర్నోవర్‌తో ఇది నడుస్తోంది. వ్యాపార అవసరాలకు రూ.3.50 లక్షలు అప్పు చేశారు. భారీ వర్షాలు, వరదలు వస్తాయన్న సమాచారంతో ఈ రెండు దుకాణాల్లో సరుకు తరలించేందుకు వారిద్దరూ ప్రయత్నించారు. కానీ, వాహనాలు, మనుషులు కుదరకపోవడంతో తరలించలేకపోయారు. ఆ దుకాణాల్లోకి నీరు చొచ్చుకురాకుండా షట్టర్లకు అడ్డుగా ఇసుక బస్తాలు ఉంచారు. కానీ, ఆ మరుసటి రోజే ఈ రెండు దుకాణాల్లోకి నాలుగడుగుల మేర నీరు చేరింది. వెంకట లక్ష్మణరావుకు చెందిన దుకాణంలో రూ.8.12 లక్షల విలువైన 580 బస్తాల (26 కిలోల) బియ్యం నీటి పాలయ్యాయి. పక్కనే ఉన్న మెడికల్ షాపులో రూ.2.50 లక్షల విలువైన మందులు, రూ.70 వేల విలువైన కౌంటర్లు, రూ.30 వేల విలువైన కంప్యూటర్, ప్రింటర్ నీటిలో మునిగిపోయాయి. వీరిద్దరూ పది రోజులుగా వ్యాపారాన్ని కోల్పోయారు. నెలాఖరుకు ఒక్కో దుకాణానికి నెలకు రూ.15 వేల అద్దె చెల్లించాలి. స్టాక్ ఇచ్చిన వారితోపాటు నెలవారీ తీర్చాల్సిన అప్పులు, చెల్లించాల్సిన అద్దెలు, తిరిగి పెట్టుబడి పెట్టి వ్యాపారం ఎలా కొనసాగించాలో తెలియడంలేదని లక్ష్మణరావు, శ్రావణ్‌కుమార్ వాపోతున్నారు.

ఎల్‌బిఎస్ నగర్‌కు చెందిన మద్దెంశెట్టి భవానీ రూ.5 వేల పెట్టుబడితో పానీపూరి, మిర్చి బజ్జీ వ్యాపారం చేసుకుంటున్నారు. వరద దెబ్బకు షాపులోని పానీపూరి, బజ్జీ తయారీకి అవసరమైన స్టవ్, సామానులు కొట్టుకుపోయాయి. కొట్లోకి సరుకులు తీసుకోవడానికి వెంట తెచ్చుకున్న స్కూటీ నీటిలో మునిగి పాడైపోయింది. అప్పులకు రోజువారీ కట్టాల్సిన రూ.200 కిస్తీలు కట్టలేకపోతున్నానని ఆమె వాపోయారు. ఎల్‌బిఎస్ నగర్‌లో ఉంటూ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు పద్ధతిలో శానిటరీ వర్కర్‌గా పనిచేస్తున్న మేకల ఈశ్వరమ్మ లక్ష రూపాయలు అప్పు తీసుకుని ఫ్రిజ్, కూలర్, వాషింగ్ మిషన్, డబుల్ కాట్ మంచం, పరుపులు అమర్చుకున్నారు. అప్పు తీరకముందే వరదకు సర్వం కోల్పోయామని, రెక్కల కష్టం వరద పాలైందని వాపోతున్నారు. ఇలా... చిన్న వ్యాపారులు, సామాన్యుల జీవితాల్లో బుడమేరు వరద కల్లోలం సృష్టించింది.


పాడైన ఫ్రిజ్‌తో శానిటరీ వర్కర్ మేకల ఈశ్వరమ్మ

Form No. 3
(See Regulation-15 (1)(a)]/16(3)
DEBTS RECOVERY TRIBUNAL, VISHAKHAPATNAM
Ground & amp; 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam- 530020
Case No.: O.A. No. 639 Of 2020
Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.
ICICI Bank Limited
AND
Satti Satya Anantha Lakshmi

To,
1) Satti Satya Anantha Lakshmi, W/o. Satyanarayana Reddy, H. No. 3-10, Arjunudu Palem, West Godavari District, Andhra Pradesh- 534217.
2) M/s. Nexus Feeds Ltd, Represented by Managing Director, Mr. G. Ramakrishna Reddy, S/o Satyanarayana Reddy, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali- 534237. West Godavari District.
3) G. Ramakrishna Reddy, S/o Satyanarayana Reddy, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali- 534237. West Godavari District.
4) Mr. G. Venkata Reddy, S/o Satyanarayana Reddy, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali- 534237. West Godavari District.
5) G. Srirama Reddy, S/o Satyanarayana Reddy, R. No. 223/2B, Opp: Saibaba Temple,Seesali- 534237. West Godavari District.
6) Goluguri Radha, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali- 534237, West Godavari District.
7) Venkata Subrahmanyan Voleti, R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali- 534237. West Godavari District.
8) Mr. Suryanarayana Vankadaru R. No. 223/2B, Opp: Saibaba Temple, Seesali- 534237. West Godavari District.
9) Pitani Srinivasa Rao, S/o Krishna, D. No. 1-94, Mulaupara Gudem, Pedalanka, Krishna District- 521344.
10) Bokka Srinivasa Rao, S/o Ramakrishna, D. No. 9-37, Mulalanka, Pedalanka, Krishna District- 521344.
11) Bokka Vinayaka, S/o Satyanarayana, D. No. 10-45/1, Mulalanka, Kalidindi, Krishna District - 521344.
12) Gudala Pavani, W/o Nagaraju, D. No. 9-90/2, Kukkalavaripalem, Kodamanchili, West Godavari- 534269.
13) Jakkamsetti Srinu, S/o Venkata Rao, D. No. 1/151B, Mulalanka, Mulauppara Gudam, Pedalanka, Krishna District- 521344.
14) J. T. R. Satyanarayana Prasad, S/o Radha Krishna Murthy, D. No.10-1-49/2, Old Super Bazar Road, 9th Ward, Chinarangani Palem, Bhimavaram- 53420. West Godavari District.
15) Ketha Manikyala Rao, S/o Satyanarayana, D. No. 1-138-1, Mulaupparagudem, Padamatipalem, Kalidindi, Krishna District- 521344.
16) Kilaparthi Nagaraju, S/o Appala Naidu, D. No. 4-8, Padamatipalem, Mulalanka, Kalidindi, Krishna District- 521344.
17) Mamidisetti Prasad, S/o Mahankali, D. No. 9-36, Satyanarayana Nagar, Mulalanka, Mulauppara Gudem, Pedalanka, Krishna District-521344.
18) Namani Anjaneyulu, S/o Trimurthulu, D. No. 1-105, Near Vanthena, Ramakrishnapuram, Mula Lanka, Kalidindi, Krishna District- 521344.
19) Nekkanti Ramesh, S/o Venkata Rao, D. No. 7-11-19, Narsapuram, West Godavari District.
20) Vempalli Srinivas, S/o Dharma Raju, D. No: 3-55, Arugolanu, Tadepalligudem, West Godavari- 534146.
21) Arumilli Venkateswara Rao, S/o Satyanarayana, Mulalanka, Peda Lanka, Kalidindi, Krishna District- 521344.
22) Bokka Jadalu, S/o Anjaneyulu, Mula Lanka, Pedalanka, Krishna District- 521344.
23) Karni Mohan Rao, S/o Venkanna, D. No. 2-121, Mulalanka, Kalidindi, Krishna District- 521344.
24) Karni Shyam Chinni, S/o Venkanna, D. No : 2-121, Mulalanka, Kalidindi,Krishna District- 521344.
25) Mutyam Vijaya Raju, S/o Bhaskara Rao, D. No. 6-30, Kalla, West Godavari
26) Sarela Peddi Raju, S/o Papa Rao, D. No. 2-130, Mulalanka, Kalidindi, Krishna District- 521344

SUMMONS TO THE DEFENDANT BY WAY OF PAPER PUBLICATION
WHEREAS, OA/639/2020 was listed before Hon'ble Presiding Officer/Registrar on 01.10.2024 WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs. 77,84,201/- application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties:
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on 01.10.2024 at 10:30 A.M. failing the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date: 13/08/2024.

Signature of the Officer Authorized to issue summons
Assistant Registrar Debts Recovery Tribunal, Visakhapatnam

ఉత్తరప్రదేశ్‌లో దారుణం

- పువ్వుల కోసం వెళ్లి నలుగురు బాలికలు మృతి

బహ్రైచ్ : ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. తామర పువ్వులు కోసుకురావడానికి వెళ్లిన నలుగురు బాలికలు చెరువులో జల సమాధి అయ్యారు. బహ్రైచ్ జిల్లాలోని నవాబ్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సత్తిజోర్ గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మెహక్ ఖాతూన్ (14), సమియా (10), సైబా (10), సరికుల్ ఖాతూన్ (13) చెరువులోకి తామర పువ్వులు కోయడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ అందులో మునిగిపోయారు. ఊపిరాడక చనిపోయారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించినట్లు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ అశ్విని కుమార్ పాండే తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొకరికి రూ 4 లక్షల పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

సత్యవేడు ఎమ్మెల్యే వ్యవహారంపై సుమోటోగా విచారించాలి : నారాయణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహిళా కార్యకర్తతో అసభ్యంగా ప్రవర్తించిన సత్యవేడు ఎమ్మెల్యే వ్యవహారంపై న్యాయ వ్యవస్థ సుమోటోగా కేసు విచారణ జరపాలని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. ఈ దర్యాప్తులో వారి వెనుక ఎవరున్నారన్న దానిపై విచారణ జరగాల్సి ఉందన్నారు. మంగళవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఉందని, భారీ వరద వల్ల తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర నష్టం సంభవించిందని, జాతీయ విపత్తుగా ప్రకటించి నిధులు విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అలాగే సీతారాం ఏచూరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, వామపక్ష ఉద్యమానికి ఆయన ఒక ప్రతీక అని, సీతారం త్వరగా కోలుకోవాలని అన్నారు.

చర్చల ప్రక్రియ దెబ్బతీసేందుకే ఉక్రెయిన్ చొరబాట్లు

- రష్యా అధికారి షోయిగు వ్యాఖ్యలు

కీవ్ : రష్యాతో చర్చల ప్రక్రియకు విఘాతం కలిగించేందుకే రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలోకి ఉక్రెయిన్ చొరబడిందని రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గి షోయిగు వ్యాఖ్యానించారు. రసియా-24కి ఇంటర్వ్యూ ఇచ్చిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు ఇంటర్‌ఫాక్స్ వార్తా సంస్థ పేర్కొంది. రష్యాలో ఉక్రెయిన్ ఆక్రమించిన ప్రాంతంలో దాదాపు వెయ్యి చదరపు కిలోమీటర్లు మేరా భూభాగాన్ని సెప్టెంబరు మొదటి వారంలో విముక్తం చేసినట్లు షోయిగు తెలిపారు. రెండు కోట్ల మందికి పైగా జనాభా నివసించే మాస్కో రీజియన్‌పై ఉక్రెయిన్ ప్రయోగించిన 20 డ్రోన్‌లను కూల్చివేసినట్లు రష్యా తెలిపింది. ఈ ఘటనలో ఒక మహిళ మరణించగా, పలువురు గాయపడ్డారని రష్యా అధికారులు తెలిపారు. రాత్రిపూట జరిగిన ఈ దాడుల్లో డజన్ల సంఖ్యలో ఇళ్ళు ధ్వంసమయ్యాయి. దాడుల కారణంగా మాస్కో చుట్టుపక్కల విమానాశ్రయాల్లో 50విమానాలను దారి మళ్ళించారు. మరో 8 ప్రాంతాలపై ప్రయోగించిన 124 డ్రోన్‌లను కూడా తమ బలగాలు ధ్వంసం చేశాయని రష్యా రక్షణ శాఖ తెలిపింది. ఇదిలావుండగా, డొంటెస్క్ రీజియన్‌లోని పలు ప్రాంతాల్లో మూడు గ్రామాలను, తూర్పు ఉక్రెయిన్‌లోని క్రాస్నోహోరివ్కా పట్టణాన్ని రష్యా బలగాలు తిరిగి స్వాధీనం చేసుకున్నాయి. రష్యా తమపై కూడా 46 డ్రోన్‌లను ప్రయోగించిందని, వాటిలో 38డ్రోన్‌లను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ తెలిపింది.

నిలకడగా మంకీ పాక్స్ రోగి ఆరోగ్యం

న్యూఢిల్లీ : మంకీ పాక్స్ వైరస్ నిర్ధారణ అయిన రోగి ఆరోగ్యం నిలకడగా ఉందని ఢిల్లీ ఆర్యోగ శాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ మంగళవారం వెల్లడించారు. రోగికి ఇక్కడి ఎల్ఎన్‌జెపి ఆసుపత్రిలో రోగి కోలుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. ఈ ఆసుపత్రిని మంత్రి ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. రోగికి ప్రత్యేకంగా చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. హర్యానాలోని హిస్సార్‌కు చెందిన 26 ఏళ్ల వ్యక్తికి సోమవారం మంకీపాక్స్ వైరస్ నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే. దీంతో సుమారు ఆరు నెలల తరువాత దేశంలో తొలి మంకీపాక్స్ కేసు నమోదయింది. విదేశాల నుంచి వచ్చిన ఈ వ్యక్తికి మంకీపాక్స్ లక్షణాలు ఉండటంతో పరీక్షలు నిర్వహించారు. రోగికి చర్మంపై పూతలు, దద్దుర్లు మాత్రమే ఉన్నాయని, జ్వరం లేదని వైద్యులు చెప్పారు.

నన్ను ఎప్పుడైనా అరెస్టు చేయవచ్చు: అనిల్ దేశ్‌ముఖ్

నాగపూర్ (మహారాష్ట్ర) : తన ఇంటిపై సిబిఐ ఎప్పుడైనా దాడి చేయవచ్చని, తనని అరెస్టు చేయవచ్చని మహారాష్ట్ర మాజీ హోంమంత్రి, ఎన్‌సిపి నేత అనిల్ దేశ్‌ముఖ్ అన్నారు. తనను అరెస్టు చేయడానికి మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రయత్నిస్తు న్నారని దేశ్‌ముఖ్ ఆరోపించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 'నాలుగేళ్లనాటి జలగావ్ కేసులో సిబిఐ నాపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీనికి కారణం మహారాష్ట్ర డిప్యూ టీ సిఎం దేవేంద్ర ఫడ్నవీస్‌నే. నేను హోంమంత్రిగా ఉన్నప్పుడు జలగావ్‌లో బిజెపి నాయకు డు గిరిష్ మహాజన్ కేసులో చర్య తీసుకునేందుకు ఒత్తిడి తీసుకొచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి' అని అన్నారు.

దుర్భరంగా పారిశుధ్య కార్మికుల పరిస్థితి

- టిఫిన్, భోజనం, మంచినీరు, మరుగుదొడ్డీ కరువే
- రోజుకు 10 నుంచి 12 గంటల చాకిరీ
- జంతు కళేబరాలు, మురుగు, దుర్వాసన మధ్య పనులు
- పట్టించుకోని ప్రభుత్వం, విఎంసి అధికారులు
- తీవ్ర నిరసన తెలుపుతున్న ఏలూరు, నెల్లూరు, ఇతర జిల్లాల కార్మికులు


విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో విధుల నిర్వహణకు వచ్చిన ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు


భోజనం చేస్తున్న ఏలూరు మున్సిపల్ కార్మికురాలు

ప్రజాశక్తి- విజయవాడ

వరద సహాయ చర్యలకు ఇతర జిల్లాల నుండి వచ్చిన పారిశుధ్య కార్మికుల పరిస్థితి అత్యంత దుర్భరంగా తయారైంది. తినడానికి తిండిలేదు. తాగడానికి మంచినీరు లేదు. చివరికి మరుగుదొడ్డి సౌకర్యం కూడా కరువైంది. దీంతో, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ నగరంతోపాటు పలు జిల్లాల నుంచి వచ్చిన వేలాది మంది పారిశుధ్య కార్మికుల పట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దురుసుగా ప్రవర్తిస్తున్నారు. కేవలం రెండు మూడు రోజుల్లోనే తిరిగి పంపుతామని చెప్పి ఇక్కడికి తీసుకొచ్చారని, అన్ని రకాల సదుపాయాలూ కల్పిస్తామని చెప్పారని, తీరా ఇక్కడ ఎన్నో కష్టాలను అనుభవిస్తున్నామని కార్మికులు వాపోతున్నారు. రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీల నుండి తీసుకొచ్చిన పారిశుధ్య కార్మికులు, పంచాయతీ కార్మికులకు ఎటువంటి కనీస వసతులూ కల్పించలేదు. వివిధ రకాల అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న కార్మికుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. వారికి కనీసం మందులు వేసుకునే సమయం కూడా దొరకడం లేదు. రోజుకు 10 నుంచి 12 గంటలు మురుగు, బురద, చెత్త, వ్యర్థాలు, జంతు కళేబరాలు, మలమూత్రాలు ఎత్తివేత ఇలా అన్ని రకాల పనులూ నిర్వహిస్తున్న కార్మికులకు కనీసం చేతులకు గ్లౌజులు, కాళ్లకు బూట్లు కూడా ఇవ్వడం లేదు. జోరు వర్షంలో కూడా విధులు నిర్వహిస్తూనే ఉన్నారు. రైయిన్ కోట్ వంటివి కూడా ఇవ్వలేదు. చేతులతో వ్యర్థాలను తీస్తున్నందున పుండ్లు పడుతున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా పనిచేసినా కడుపునిండా భోజనం అధికారులు అందించలేకపోతున్నారని వాపోతున్నారు. నగరంలో వివిధ ప్రజాసంఘాలు, సిపిఎం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆరు ఆహార పంపిణీ కేంద్రాల్లోనే మధ్యాహ్నం, రాత్రి వీరు భోజనాలు చేస్తున్నారు. ఆయా కేంద్రాల వద్ద మున్సిపల్ కార్మికులు బారులుతీరుతున్నారు.

ప్రభుత్వం, అధికారులు కనీసం భోజన సౌకర్యాలు కూడా కల్పించలేకపోవడంతో నెల్లూరు, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర కార్పొరేషన్ల నుంచి వచ్చిన వేలాది మంది కార్మికులు సోమ, మంగళవారాల్లో రోడ్డెక్కారు. కనీసంగా ఉండడానికి వసతి కూడా చూపించలేదని ఆగ్రహించారు. మంచినీరు కూడా దొరకడం లేదని వాపోతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పనులు చేస్తున్నప్పటికీ భోజనం లేక పస్తులతో ఉండాల్సి వస్తోందని ఏలూరుకు చెందిన సుమారు 300 మంది కార్మికులు, సంబందిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయవాడ పైపుల రోడ్డు సెంటర్‌లో విఎంసి ప్రజారోగ్య విభాగం అధికారులను నిలదీశారు. దీంతో, ఏలూరు నుండి వచ్చిన మున్సిపల్ సిబ్బందికీ, విజయవాడ కార్పొరేషన్ శానిటరీ అధికారులకూ మధ్య మంగళవారం వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఒకానొక దశలో ఇలాగైతే పని చేయలేమని, తామంతా వెళ్లిపోతామని హెచ్చరించారు. తాము కూడా దాతలు పెడ్తున్న అన్నం కోసం ఎదురు చూడాల్సి వస్తోందని, సకాలంలో భోజనం అందక తమ ఆరోగ్యం క్షీణించిందని ఏలూరు నుంచి వచ్చిన పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగన్నం ప్యాకెట్లో పెట్టి ఇచ్చారని, కనీసం తినడానికి కూడా వీలులేకుండా ఉందని ఓ కార్మికురాలు మీడియా ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడికి వచ్చే సమయంలో ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని, కనీసం టీ తాగడానికి కూడా డబ్బులు లేవని ఆవేదన చెందారు. విఎంసి అధికారులు కనీసం ఉదయం టీ, టిఫిన్ కూడా పెట్టడం లేదన్నారు. పాఠశాలలు, సత్రాలు, కమ్యూనిటీ హాళ్లలో వసతి ఏర్పాటు చేసినా, అక్కడ కనీస సదుపాయాలు లేవని తెలి పారు. కనీసం మరుగుదొడ్ల సదుపాయం కల్పించ లేదని వాపోయారు. వివిధ ప్రజా సంఘాలు, సిపిఎం ఏర్పాటు చేసిన ఆహార కేంద్రాల్లో ఐదారు రోజులుగా భోజనం చేస్తున్నామని తెలిపారు.

మున్సిపల్ కార్మికులను ఆదుకోవాలి

ఇతర జిల్లాల నుండి తీసుకొచ్చిన మున్సిపల్ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించి వారిని ఆదుకోవాలని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. వారికి ఐదు రోజులు సెలవుతో కూడిన వేతనం ఇవ్వాలని, ఒక నెల బోనస్ ప్రకటించాలని, తీవ్రంగా గాయపడిన, అనారోగ్యాలకు గురైన కార్మికులందరికీ వైద్యం అందించాలని కోరారు.

-మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు)


రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

రైతులను ప్రభుత్వం పూర్తిగా ఆదుకోవాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-భట్టిప్రోలు (బాపట్ల జిల్లా)

కృష్ణా నది వరదలకు లంక గ్రామాల్లో దెబ్బతిన్న పంటలతో రైతులకు జరిగిన నష్టం ఏ ఒక్కరూ పూడ్చలేనిదని ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రైతులను ప్రభుత్వం పూర్తిగా ఆదుకోవాలని కోరారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని లంక గ్రామాల్లో ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం రాష్ట్ర బృందం మంగళవారం పర్యటించింది. దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించింది. బాధిత రైతులతో మాట్లాడి వివరాలు సేకరించింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. లంక గ్రామాల్లో రైతులు సాగుచేసిన కంద పంట పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. ఇప్పటికే ఎకరాకు రూ.రెండున్నర లక్షల నుండి రూ.3 లక్షల వరకు పెట్టుబడులు పెట్టి దెబ్బతిన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పసుపు పంటకు ఎకరాకు లక్ష రూపాయలకుపైగా ఖర్చు చేశారని తెలిపారు. దీంతోపాటు అరటి, తమలపాకు, కూరగాయల వంటి పంటలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం పారదర్శకంగా సర్వే నిర్వహించి.. రైతులకు పూర్తిగా ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ లంక గ్రామాల్లో వరదల కారణంగా కౌలు రైతులే ఎక్కువగా నష్టపోయారని తెలిపారు. పంటలు నష్టపోయిన నిజమైన సాగుదారులను గుర్తించి నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు కేంద్ర నిపుణుల బృందం పర్యటన

ఆర్‌పి సిసోడియా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వరద పరిస్థితిని అక్కడికక్కడే అంచనా వేయడానికి కేంద్ర నిపుణుల బృందం బుధ, గురువారాల్లో రాష్ట్రంలో పర్యటిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా పేర్కొన్నారు. కేంద్ర హోమ్‌శాఖ అనిల్‌సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని బృందంలో మహారాష్ట్ర వ్యవసాయశాఖ సంచాలకులు డాక్టర్ ఎఎల్‌వఘ్‌ఘర్, ఉపరితల రవాణాశాఖ చీఫ్ ఇంజనీరు రాకేష్‌కుమార్, ఆర్థిక శాఖ కన్సల్ టెంట్ ఆర్‌బి కౌల్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉప కార్యదర్శి ప్రదీప్‌కుమార్, ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌వి ఎస్‌పి శర్మ ఉన్నారని తెలిపారు. బుధవారం ఉదయం విపత్తుల నిర్వహణ శాఖ కార్యాలయాన్ని సందర్శించి సమగ్ర నివేదికను తీసుకున్న అనంతరం పర్యటనకు రెండు బృందాలుగా విడిపోయి పర్యటిస్తారని సిసోడియా తెలిపారు. ఒక బృందం మధ్యాహ్నం 12.30 గంటలకు ముస్తాబాద చేరుకుంటుంది. అక్కడ నుంచి గన్నవరం, హనుమంతపురం, బుడమేరు ప్రాంతాల్లో వరద నష్టం లెక్కకడతారు. మధ్యాహ్నం 2.30గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు చేరుకుని పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు పెనమలూరు, 3.30గంటలకు యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం, మద్దూరు గ్రామాల్లో పర్యటిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు నందివాడ చేరుకుని అనంతరం విజయవాడకు బృందం చేరుకుంటుంది. గురువారం ఉదయం 9.45 గంటలకు విజయవాడ కలెక్టరేట్‌లో పిపిటి తీసుకున్న అనంతరం ప్రకాశం బ్యారేజీకు చేరుకుంటారు. 11.15గంటలకు ఇబ్రహీంపట్నం, 12.15గంటలకు మైలవరం, 1.15గంటలకు అజిత్‌సింగ్‌నగర్‌లో పర్యటిస్తారు. మార్గమధ్యంలో బుడమేరు స్థితిగతులను పర్యవేక్షిస్తారు.

రెండోబృందం బుధవారం ఉదయం 12.30గంటలకు బాపట్లజిల్లా వేమూరు, 12.30గంటలకు కొల్లూరు మండలం ఈపూరులంక, 3గంటలకు అరవింద వారధి, 3.20గంటలకు పెసర్లంక, 3.35గంటలకు నక్కపాయ, 4గంటలకు పల్లెపాలెంలోని ఓలేరు, 4.15గంటలకు రావి అనంతవరం, 4.05గంటలకు కనగాలలో పరిశీలించి బృందం గుంటూరు చేరుకుంటారు. గురువారం ఉదయం 9 గంటలకు గుంటూరు కలెక్టర్ కార్యాలయం, 9.40గంటలకు పెదకాకాని, 10 గంటలకు వెంకట కృష్ణాపురం, 11.15గంటలకు మంగళగిరి, 11.50 గంటలకు తాడేపల్లి, 12.20 గంటలకు తాడేపల్లి, 12.20గంటలకు వెంకటపాలెం సందర్శించి విజయవాడ చేరుకుంటారని ఆర్‌పి సిసోడియా తెలిపారు.

కేంద్రం నుండి రూ.10 వేల కోట్ల వరద సాయం రాబట్టాలి

- ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల


విజయవాడ పాత రాజరాజేశ్వరిపేటలో వరద బాధితులతో మాట్లాడుతున్న వై.ఎస్.షర్మిల

ప్రజాశక్తి - విజయవాడ

కేంద్ర ప్రభుత్వం నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.పది వేల కోట్లు వరద సాయం తీసుకురావాలని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల అన్నారు. చిన్న పిల్లల వద్ద విరాళాలు తీసుకోవడం కాదని, ఇప్పటి వరకూ బిజెపికి ఊడిగం చేసిన సిఎం చంద్రబాబు కేంద్రం నుండి వరద సాయం నిధులు రాబట్టాలన్నారు. విజయవాడ పాత రాజరాజేశ్వరి పేటలో బుడమేరు వరద బాధితులను మంగళవారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో షర్మిల మాట్లాడుతూ ఇలాంటి విపత్తులో ప్రధాని మోడీ కనీసం స్పందించడంలేదన్నారు. బిజెపి చేసిన మోసంపై చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. కేంద్రం నుంచి కనీస సాయం అందలేదని, గుక్కెడు నీళ్లు అందక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడ్డారని, బుడమేరు వరదపై టిడిపి, వైసిపి బురద రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. బుడమేరు వరదకు గతంలోని వైసిపి, ప్రస్తుత టిడిపి ప్రభుత్వాలే కారణమని అన్నారు. వరద కారణంగా సర్వం కోల్పోయిన వారి కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుడమేరు సృష్టించిన వరద బీభత్సం అంతా ఇంతా కాదని, తీరని శోకాన్ని మిగిల్చిందన్నారు. రెండు వారాలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వరదలకు ఇప్పటి వరకు 50 మంది చనిపోయారని, సుమారు ఏడు లక్షల మంది నిరాశ్రయులయ్యారని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టులో ఆరుగురు ఎఎస్‌జిల నియామకం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
కేంద్ర ప్రభుత్వం ఆరుగురు సీనియర్ న్యాయవాదులను సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జి)గా నియమించింది. కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ (ఎసిసి) వారి నియామకానికి ఆమోదం తెలిపింది. సర్వోన్నత న్యాయస్థానంలో అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమితులైన వారిలో ఎస్ ద్వారాకనాథ్, అర్చన పాథక్ దేవె, సత్యదర్శి సంజయ్, బ్రిజేందర్ చాహర్, రాఘవేంద్ర పీ శంకర్, రాజ్‌కుమార్ భాస్కర్ థాకరే ఉన్నారు.

జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరిస్తే నిధులు ఇవ్వరా ?

- కేంద్రం తీరును నిలదీసిన స్టాలిన్



చెన్నై : జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఇపి) తిరస్కరించామన్న కారణంతో దేశంలో బాగా పనిచేస్తున్న రాష్ట్రాలకు నిధులు ఇవ్వడానికి కేంద్రం నిరాకరిస్తోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ విమర్శించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో సోమవారం ఒక పోస్టు పెట్టారు. అదే సమయంలో తమ లక్ష్యాలను సాధించని రాష్ట్రాలకు మాత్రం ఉదారంగా నిధులు అందచేస్తున్నారని, నాణ్యత గల విద్యను, సమానత్వాన్ని పెంపొందించేందుకు బిజెపి ప్రభుత్వం ఈ విధంగా ప్రణాళికలు రూపొందిస్తోందా అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాన్ని మన దేశ ప్రజల విజ్ఞతకే వదిలివేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. అమెరికాలో అధికార పర్యటనలో వున్న స్టాలిన్, ఈ విషయమై హిందూలో ప్రచురితమైన వార్తా కథనాన్ని షేర్ చేశారు. సమగ్ర శిక్షా పథకం ఫలితాల కన్నా పిఎం-శ్రీ పథకం ఆమోదించారా లేదా అన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్రం నిధులను నిలిపివేస్తోందని ఆ కథనం పేర్కొంది.



చెన్నయ్ యూనిట్‌లో శాంసంగ్ ఉద్యోగుల సమ్మె

చెన్నయ్ : వేతనాలు పెంచాలనే డిమాండ్‌తో చెన్నయ్ సమీపంలో శ్రీపెరంబుదూర్‌లోని శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ప్లాంట్ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. వేతన పెంపు, బోనస్ విషయంలో యాజమాన్యంతో చర్చలు విఫలం కావడంతో ఉద్యోగులు గత సోమవారం నుంచి ఈ సమ్మె కొనసాగిస్తున్నారు. మంగళవారం రెండో రోజూ కూడా దాదాపు రెండు వేల మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు. సమ్మెతో ప్లాంటులో ఉత్పత్తి స్థంభించినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ ప్లాంట్‌లో వాషింగ్ మెషిన్లు, రిఫ్రిజిరేటర్లు తయారు చేస్తారు. అయితే రోజువారీ చేసే ఉత్పత్తిలో సగం ఉత్పత్తి మాత్రమే జరిగినట్లు ప్లాంట్‌తో సంబంధం ఉన్న వ్యక్తులు మంగళవారం తెలిపారు. శాంసంగ్‌కు భారత్‌లో రెండు ఉత్పత్తి ప్లాంట్లు ఉన్నాయి. ఒకటి శ్రీపెరంబుదూర్ ప్లాంట్ కాగా, రెండోవది ఉత్తర ప్రదేశ్‌లోని నోయిడాలో ఉంది. ఇక్కడ స్మార్ట్‌ఫోన్లు ఉత్పత్తి చేస్తారు. శాంసంగ్ కార్మికులు సమ్మెకు దిగడం ఇదే తొలిసారి కాదు. దక్షిణకొరియాలోని శాంసంగ్ ఎలక్ట్రానిక్స్‌కు చెందిన అతిపెద్ద ప్లాంట్‌లో ఆగస్టులో కార్మికులు నాలుగు రోజుల పాటు సమ్మె నిర్వహించిన సంగతి విదితమే.

వామపక్ష ప్రభుత్వ చొరవతోనే హేమ కమిటీ

- బాధితుల ఫిర్యాదులపై సమగ్ర దర్యాప్తు
- కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్



తిరువనంతపురం : చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం దిశగా కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ హేమ కమిటీపై దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ సినీ పరిశ్రమలో జోక్యం చేసుకుని జస్టిస్ హేమ కమిటీ తరహా కమిటీలను ఏర్పాటు చేయలేదని.. కేరళలో వామపక్ష ప్రభుత్వ చొరవతోనే హేమా కమిటీ సాధ్యమైందని ఆయన అన్నారు. ఇప్పటికే ఈ కమిటీ ముందు వాంగ్మూలాలు ఇచ్చినవారు, ఇవ్వని వారు సైతం పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని, వాటిపై సమగ్రంగా దర్యాప్తు చేయిస్తామని తెలిపారు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో మహిళా వైద్యురాలిపై అత్యాచార ఘటన నేపథ్యంలో మహిళల భద్రతపై పెద్దయెత్తున చర్చ జరుగుతోందని ఈ సందర్భంగా విజయన్ పేర్కొన్నారు. మంగళవారం తిరువనంతపురంలో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన విజయన్ .. దేశంలోని అనేక రాష్ట్రాల్లో మహిళలపై దాడులు కొనసాగుతుండటం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

ఆ ఘటనతో సమాజానికి తప్పుడు సందేశం

'బిల్కిస్ బానో కేసులో నిందితుల విడుదల, వారికి ఘనస్వాగతం పలకడం వంటి పరిణామాలు సమాజానికి తప్పుడు సందేశాన్నిచ్చాయి. జాతీయ స్థాయిలో ఇలాంటి పరిస్థితులు నెలకొని ఉన్న నేపథ్యంలో కేరళ ప్రభుత్వం మహిళల భద్రతకు భరోసా ఇచ్చేలా కచ్చితమైన విధానాలతో ముందుకెళ్తోంది. సినీ పరిశ్రమలో పలు సమస్యలు ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే జస్టిస్ హేమ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలో మరే ఇతర రాష్ట్రమూ ఈ తరహాలో సినీ పరిశ్రమలో జోక్యం చేసుకోలేదు. కేరళలో వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్లే ఇది సాధ్యమైంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో జస్టిస్ హేమ కమిటీ తరహాలో ప్యానెల్స్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు పలు రాష్ట్రాల్లో వస్తున్నాయి. కమిటీ నివేదికకు సంబంధించి న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతున్నాయి. అలాంటి ఫిర్యాదులు ఏవి వచ్చినా దర్యాప్తు వ్యవస్థ రంగంలోకి దిగేందుకు సిద్ధంగా ఉంది' అని సిఎం పినరయి విజయన్ తెలిపారు.

ఇకె నయనార్ స్మారక భవనం ప్రారంభం

సిపిఎం కోవలం ఏరియా కమిటీ కార్యాలయ భవనం ఇకె నయనార్ స్మారక భవనం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలోనూ విజయన్ ప్రసంగించారు. ఈ కార్యాక్రమాన్ని పురుస్కరించుకొని స్థానిక సిపిఎం కార్యకర్తలు సమీకరించిన నిధులతో సకల హంగులతో నిర్మించిన 11 గృహాలకు సంబంధించిన తాళాలను 11 నిరుపేద కుటుంబాలకు విజయన్ అందజేశారు.



కేరళ డిజిపి షేక్ దార్వేష్ సాహెబ్‌కు పురస్కారం అందచేస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

సైబర్ నేరాలపై ఉక్కుపాదం

- కేరళ పోలీసులకు కేంద్ర హోం శాఖ అవార్డు

తిరువనంతపురం : మహిళలు, బాలలపై జరిగే సైబర్ నేరాల విషయంలో సమర్థవంతంగా వ్యవహరించినందుకు గానూ కేరళ పోలీసులకు కేంద్ర హోం శాఖ అవార్డు లభించింది. ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ మొదటి వ్యవస్థాపక దినోత్సవం మంగళవారం న్యూఢిల్లీలో జరిగింది. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అమిత్ షా ఈ అవార్డును అందచేశారు. రాష్ట్ర పోలీసుల తరపున రాష్ట్ర డిజిపి షేక్ దార్వేష్ సాహెబ్, సైబర్ ఆపరేషన్స్ ఎస్‌పి హరి శంకర్‌లు ఈ అవార్డును అందుకున్నారు. 27680 బ్యాంక్ ఖాతాలను పోలీసులు డీ యాక్టివేట్ చేశారని, 11,999 సిమ్ కార్డులను రద్దు చేశారని, 17,734 వెబ్‌సైట్‌లను చట్ట విరుద్ధమైనవిగా గుర్తించారని అధికార వర్గాలు తెలిపాయి. 8,369 బూటకపు సోషల్‌మీడియా ప్రొఫైల్స్‌ను, 537 బూటకపు మొబైల్ అప్లికేషన్స్‌ను గుర్తించారు. బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారని ఆ వర్గాలు తెలిపాయి. విదేశాల నుండి ఆర్థిక అవకతవకలకు పాల్పడిన భారతీయులపై 17 కేసులు నమోదు చేశారు. 51మంది ఏజెంట్లను పట్టుకుని 16మందిని అరెస్టు చేశారు. సైబర్ నేరాలన కనుగొనడంలో వెయ్యి మందికి పైగా పోలీసు అధికారులకు కేరళ పోలీసులు శిక్షణ ఇచ్చారు. మూడు దశల్లో 360 మంది ఎస్‌ఐలు, ఇనస్పెక్టర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

మహారాష్ట్ర బిజెపి చీఫ్ కుమారుడి నిర్వాకం

- రోడ్డుపై ఆడి కారుతో బీభత్సం
- పలు వాహనాలను ఢీకొట్టి పరారీ

నాగపూర్ : అసలే కోతి...ఆపై కల్లు తాగింది...ఇది ఓ సామెత. కట్ చేస్తే అతను మహారాష్ట్ర బిజెపి అధ్యక్షుడు చంద్రశేఖర్ బావన్‌కులే కుమారుడు. పేరు సంకేత్ బావన్‌కులే. అతనికి ఖరీదైన ఆడి కారు ఉంది. ఇకనేం? రయ్యిమంటూ నాగపూర్‌లో జనసమ్మర్దంగా ఉన్న ఓ రోడ్డుపై కారును పరుగులు పెట్టించాడు. ఎదురుగా వచ్చిన వాహనాలను ఢీకొట్టాడు. దీనికి సంబంధించిన 14 సెకన్ల వీడియో క్లిప్పింగ్ ఇప్పుడు వైరల్ అవుతోంది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో కారులో ఐదుగురు ప్రయాణిస్తున్నారు. సాకేత్ సహా ముగ్గురు పరారు కాగా డ్రైవర్, మరో ప్రయాణికుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరందరూ ఓ బీర్ బార్ నుండి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అరెస్టయిన వారి రక్త నమూనాలను పోలీసులు సేకరించి పరీక్షకు పంపారు. బైకు మీద ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు కూడా ఈ ప్రమాదంలో గాయపడ్డారు. సాకేత్ కారు మరికొన్ని వాహనాలనూ ఢీకొంది. వాటిలో ఓ వాహనంలో ఉన్న వారు ఆడి కారును వెంబడించి మంకాపూర్ బ్రిడ్జి సమీపంలో దానిని ఆపారు. సెంట్రల్ పాయింట్ హోటల్ ఎదుట ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. 'రెండు కార్లు, ఓ బైక్‌ను ఢీకొన్న కారు వేగంగా వెళ్లిపోయింది. దీనికి సంబంధించి కేసు నమోదు చేశాము. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశాము' అని సితాబుల్డీ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ అనామికా మిర్జాపూర్ చెప్పారు. నిందితులను అర్జున్ హారే, రౌనిత్ చిట్టంవార్‌గా గుర్తించారు.

ఆడి కారు తన కుమారుడి పేరిటే రిజిస్టర్ అయిందని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు చంద్రశేఖర్ అంగీకరించారు. పోలీసులు నిష్పాక్షిక విచారణ జరిపి, తప్పు చేసిన వారిని శిక్షించాలని కోరారు. చట్టం అందరికీ సమానమేనని ముక్తాయింపు ఇచ్చారు.

మానవతా కారిడార్‌పై ఇజ్రాయెల్ దాష్టీకాలు

- వైమానిక దాడుల్లో గాజాలో ఒకేరోజు 40 మంది మృతి



గాజా : పాలస్తీనియన్ ప్రజలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ తన దాష్టీకాలను యథేశ్చగా కొనసాగిస్తూనేవుంది. అంతర్జాతీయ మానవతా కారిడార్లను సైతం అది లక్ష్యంగా చేసుకొని వైమానిక దాడులకు పాల్పడుతోంది. గాజాలోని మానవతా కారిడార్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడి చేయడంతో 40 మంది మరణించినట్లు సివిల్ డిఫెన్స్ ఏజెన్సీ పేర్కొంది. మరో 60 మందికి పైగా ప్రజలు గాయపడినట్లు వెల్లడించింది. అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. యుద్ధానికి ముందు గాజాలోని ఖాన్ యూనిస్‌లోని అల్-మవాసీ ప్రాంతాన్ని ఇజ్రాయెల్ సైన్యం సురక్షిత మానవతా కారిడార్‌గా గుర్తించింది. దాంతో దాదాపు 10 వేల మంది పాలస్తీనియన్లు అక్కడ ఆశ్రయం పొందారు. అయినప్పటికీ ఇజ్రాయెల్ పలుమార్లు ఈ ప్రాంతంలో దాడులకు పాల్పడింది. కాగా, తాజాగా సోమవారం అర్ధరాత్రి గాజాలోని మానవతా కారిడార్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 40 మంది మృతి చెందగా, గాయపడిన 60 మందికి పైగా ప్రజలను సమీపంలోని ఆస్పత్రికి తరలించినట్లు సివిల్ డిఫెన్స్ అధికారి మహ్మద్ అల్-ముఘైర్ మంగళవారం ఉదయం పేర్కొన్నారు. శిథిలాల్లో చిక్కుకున్న మరో 15 మందిని వెలికితీసేందుకు కృషి చేస్తున్నామన్నారు. వైమానిక దాడిలో ప్రజలు ఆశ్రయం పొందుతున్న 40 కంటే ఎక్కువ టెంట్లు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో జులైలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో హమాస్ మిలిటరీ చీఫ్ మొహమ్మద్ దీఫ్ సహా 90 మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు.

గాజాలో ఇజ్రాయెల్ చేసిన దాడిలో ఇప్పటివరకు దాదాపు 40,988 మంది మరణించారని హమాస్ ఆధ్వర్యంలోని ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. మృతుల్లో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులే ఉన్నారని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం పేర్కొంది. ఐక్యరాజ్య సమితి తెలిపిన వివరాల ప్రకారం.. దాడుల వల్ల సంవత్సర కాలంగా గాజాలోని 2.4 మిలియన్ల జనాభాలో అత్యధికులు కనీసం ఒక్కసారైనా నివాస ప్రాంతాలు మారుతూ ఉన్నారు. ప్రస్తుతం అల్‌మసి ప్రాంతంలో చదరపు కిలోమీటరులో 34 వేల మంది ప్రజలు ఆశ్రయం పొందుతున్నారు. సేఫ్ జోన్‌ను 50 చదరపు కిలోమీటర్ల నుంచి 41కి కుదించారు.

వాయుసేనలో లైంగిక వేధింపుల కలకలం

- రెండేళ్లుగా వేధిస్తున్నట్లు మహిళా అధికారి ఫిర్యాదు
- శ్రీనగర్ బేస్ వింగ్ కమాండర్‌పై కేసు నమోదు



శ్రీనగర్ : భారత వైమానిక దళంలో లైంగిక వేధింపులు కలకలం రేపాయి. శ్రీనగర్‌లోని వాయుసేన కేంద్రంలో మహిళా అధికారిపై స్థానికంగా పనిచేస్తున్న వింగ్ కమాండర్ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో ఆయనపై కేసు నమోదు చేశారు. గత రెండేళ్లుగా వింగ్ కమాండర్ తనను మానసికంగా వేధించడంతో పాటు అత్యాచారానికి కూడా పాల్పడ్డారని బాధిత మహిళా అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుద్గామ్ పోలీసులు ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు. శ్రీనగర్ బేస్‌లో వింగ్ కమాండర్ స్థాయి అధికారి డిసెంబర్ 31, 2023న తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు అదే కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా అధికారిణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అసహజ శంగారంలో పాల్గొనాలని బలవంతం చేస్తున్నాడని.. గత రెండేళ్లుగా లైంగికంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఆరోపించినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి ఇంతకు ముందే తీసుకెళ్లినప్పటికీ న్యాయం జరగలేదని తెలిసింది. ఈ వ్యవహారంపై భారత వాయుసేన కూడా స్పందించింది. ఈ కేసు గురించి తమకు సమాచారం ఉందని వెల్లడించింది. దర్యాప్తులో భాగంగా శ్రీనగర్‌లోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను బుద్గామ్ పోలీసులు సంప్రదించారని.. వారికి పూర్తిగా సహకరిస్తున్నామని వాయుసేనకు చెందిన ఓ సీనియర్ అధికారి తెలిపారు.

కొల్‌కతాలో మరో ఘోరం

- కదులుతున్న బస్సులో మహిళపై వేధింపులు

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్ రాజధాని కొల్‌కతాలో మరో ఘోరం జరిగింది. మంగళవారం ఉదయం 9:30 గంటలకు కదులుతున్న బస్సులో సుమారు 20 ఏళ్ల మహిళపై ఒక దుర్మార్గుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధిత మహిళ భయంతో కేకలు వేయడం ప్రారంభించడంతో తోటి ప్రయాణీకులు నిందితుడ్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. తరువాత ఆ వ్యక్తి బస్సు దిగి పారిపోవడానికి ప్రయత్నించాడు. అయితే సమీపంలోని వ్యక్తులు అతన్ని పట్టుకుని కస్బా పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. మహిళ ఫిర్యాదుతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బాధిత మహిళ కస్బా నుంచి పూల్‌బగన్‌కు తన ఆఫీస్‌కు ప్రయాణం చేస్తుండగా ఈ దారుణం జరిగింది.

పరిశోధనా వ్యవస్థలో అడ్డంకులను తొలగించాలి

- ఎఎన్ఆర్ఎఫ్ గవర్నింగ్ బాడీ సమావేశంలో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : దేశ పరిశోధనా వ్యవస్థలో ఎదురయ్యే అడ్డంకులను గుర్తించి, వాటిని తొలగించాల్సిన అవసరం వుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. పెద్ద లక్ష్యాలు పెట్టుకోవాలని, వాటిని సాధించడంపై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రస్తుతమున్న సమస్యలకు కొత్త పరిష్కారాలను కనుగొనడంపై పరిశోధన జరగాలన్నారు. సమస్యలు చూసినట్లైతే అవి అంతర్జాతీయ స్థాయిలో వుండొచ్చు కానీ వాటికి పరిష్కారాలు భారతీయ అవసరాలకు అనుగుణంగా స్థానికంగా వుండాలన్నారు. రూ.50వేల కోట్లతో కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని అనుసంధాన్ జాతీయ పరిశోధనా ఫౌండేషన్ (ఎఎన్ఆర్ఎఫ్) భావిస్తోందని చెప్పారు. అందులో రూ.36వేల కోట్లు ప్రభుత్వేతర వనరుల నుండి సేకరిస్తామని చెప్పారు. ఎఎన్ఆర్ఎఫ్ గవర్నింగ్ బోర్డు మొదటి సమావేశాన్ని ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రధాని ప్రసంగించారు. కీలకమైన రంగాల్లో భారత్ స్థానం, జాతీయ ప్రాధాన్యాలతో ఆర్ అండ్ డి ని ముడిపెట్టడం, అందరినీ కలుపుకుని పోయే అభివృద్ధి క్రమాన్ని పెంపొందించడం, సామర్థ్య నిర్మాణాలు, శాస్త్రీయ పురోగతి, వినూత్నమైన పర్యావరణ వ్యవస్థలను ఆవిష్కరించడం విద్యా పరిశోధన, పారిశ్రామిక రంగాల్లో వర్తింపు మధ్య గల అంతరాలను తగ్గించడం వంటి పలు అంశాలపై గవర్నింగ్ బాడీలో చర్చించినట్లు చెప్పారు.



మౌన నితీష్‌పై సడలిన విశ్వాసం

- 'కార్యకర్త సంవాద్ యాత్ర' ప్రారంభంలో తేజస్వి యాదవ్

పాట్నా : కేంద్రంలోని బిజెపి నేతృత్వ ఎన్‌డిఎ ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నా..అందులో భాగస్వామిగా ఉంటూ 'మౌన ప్రేక్షకునిగా వ్యవహరిస్తున్న బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై రాష్ట్ర ప్రజలకు విశ్వాసం సడిలిపోయింది' అని ఆర్‌జెడి నాయకులు తేజస్వి యాదవ్ విమర్శించారు. 'కార్యకర్త సంవాద్' పేరిట పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు ఆయన చేపట్టిన యాత్ర సమస్తిపూర్‌లో మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ పార్టీకి నిజమైన వెన్నముకగా ఉండే కార్యకర్తలను కలవడానికే తాను ఈ యాత్రను చేపట్టినట్టు తెలిపారు. భారతరత్న, ప్రముఖ బిసి నేత కర్పూరి ఠాకూర్‌కు తాను అనుచరుడిగా భావిస్తానని, అందుకనే తన యాత్రను ఠాకూర్ ప్రాతినిధ్యం వహించిన సమస్తిపూర్ నుంచి ప్రారంభించినట్లు చెప్పారు. ఈ యాత్ర తొలి దశలో దర్భంగా, మధుబని, ముజఫర్‌పూర్‌లోనూ నిర్వహించి దసరా తరువాత రెండో దశ ప్రారంభించనున్నారు.

గోదావరి మళ్లీ ఉగ్రరూపం

(మొదటి పేజీ తరువాయి)

విఆర్.పురం-చింతూరు మండలాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కొయగూరు వాగు పొంగడంతో ఆంధ్ర-ఒడిశా రహదారిపై నీరు చేరింది. ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే రోడ్డు ముంపునకు గురవడంతో రాకపోకలకు ఆటంకం కలిగింది.

వరద నీటిలో నిరసన

గోదావరి ఉధృతితో శబరి ఒడ్డు సంతపాకలు ప్రాంత ప్రజలు శబరి బ్రిడ్జిపై గూడారాలు వేసుకుని పిల్లాజెల్లతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అధికారులు తమను తరలించేందుకు ట్రాక్టర్లు కూడా పంపలేదని వాపోయారు. తమను ఆదుకునే నాథుడే లేడంటూ వరద నీటిలో నినాదాలు చేస్తూ కొందరు నిరసన తెలిపారు. తమకు పునరావాసం కల్పించాలని కోరారు. ఎటపాక మండలం మురుమూరు వద్ద కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. శ్రీరామగిరి గ్రామంలోకి వరద రావడంతో గుట్టలపైకి జనం చేరి గూడారాలు వేసుకున్నారు. కూనవరం మండలం ఉదయభాస్కర్ కాలనీ వాసులు పునరావాస కేంద్రాలకు తరలివెళ్తున్నారు.

ఏలూరు జిల్లాలో 50 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ఏలూరు జిల్లాలో 50 గ్రామాలకు రాకపోకలు నిల్చిపోయాయి. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే మార్గంలో కన్నాయిగుట్టలోని జిల్లేడు చెరువు వద్ద వరద ప్రవాహంతో కొత్తూరు, బోళ్లపల్లి, ఎడవల్లి కోయిదా, కట్కూరు తదితర 30 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. సీతారామనగరం-వేలేరు మధ్య ప్రధాన రహదారి, ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగుపైగల కాజ్‌వే నీట మునగడంతో 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే ముంపులోనే ఉంది. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్థానిక అధికారులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలైన తాట్కూరుగొమ్ము, రేపాకగొమ్ము తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని కోరారు. తిరుమలాపురం నిర్వాసితులను కన్నాయిగుట్ట పునరావాస కేంద్రానికి, తాట్కూరుగొమ్ము ప్రజలను భూదేవిపేటలోని కెజిబివి హాస్టల్‌కు, నాళ్లవరం ప్రజలను నాళ్లవరం కాలనీలోకి, రేపాకగొమ్ము ప్రజలను నెమలిపేట ఆర్అండ్ఆర్ కాలనీకి, వేలేరుపాడు మార్కెట్లోని ప్రజలను శివకాశిపురంలోని ఆశ్రమం పాఠశాలలోని పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని అధికారులను ఆదేశించారు. వేలేరుపాడు నుంచి రుద్రంకోటకు వెళ్లే రహదారి, రేపాకగొమ్ము రహదారులపై నడుములోతు నీళ్లు ప్రవహిస్తుండడంతో రేపాకగొమ్ము ప్రజలు పునరావాస కేంద్రాలకు సైతం పడవలపై వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గొమ్ముగూడేనికి చెందిన 130 కుటుంబాలు ముందుగానే పునరావాస కేంద్రానికి చేరుకోగా వరద పెరుగుతుండడంతో గ్రామంలోని మిగిలిన 123 కుటుంబాలు రావికుంట పునరావాస కేంద్రానికి వెళ్లాయి. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని లంక వాసులు దిక్కుబిక్కుమంటున్నారు.


చింతూరు మండల కేంద్రంలో నిలచిన నీరు

నీట మునిగిన భద్రాచలంలోని స్నానాల ఘాట్

భద్రాచలంలోని స్నానాల ఘాటు, నిమజ్జన ఘాటు నీట మునిగాయి. రాములోరి దర్శనానికి వచ్చే యాత్రికులను గోదావరి పరిసర ప్రాంతాల వద్దకు రానివ్వకుండా అధికారులు నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే జాతీయ రహదారిలో రాకపోకలను నిలిపివేశారు.

సవాళ్ల సుడిగుండంలో ఆర్థికాభివృద్ధి

- భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, వాతావరణ మార్పులతో రూపు రేఖలు మారుతున్న వైనం
- ప్రపంచ వాణిజ్య సంస్థ హెచ్చరిక

జెనీవా : ప్రపంచంలో ఆర్థికాభివృద్ధి సవాళ్ల సుడిగుండంలో చిక్కుకుందని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) పేర్కొంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, డిజిటల్ విప్లవం, వాతావరణ మార్పులు వంటివి ఆర్థికాభివృద్ధి రూపు రేఖలను మార్చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. 'ప్రపంచ వాణిజ్య నివేదిక - 2024' పేరుతో డబ్ల్యుటిఒ ఇటీవల ఒక నివేదిక విడుదల చేసింది. భౌగోళికంగా, రాజకీయంగా తలెత్తే ఉద్రిక్తతలు, ప్రాంతీయ ఘర్షణలు, వాణిజ్య ఆంక్షలు ఇవన్నీ కలిసి గత 30 ఏళ్ళలో ప్రపంచ ఆర్థికాభివృద్ధి పునాదిని తీవ్రంగా ప్రభావితం చేశాయని అంచనా వేసింది. ఈ పరిస్థితులు వాణిజ్య విభజనకు దారి తీసే అవకాశాలు వున్నాయని పేర్కొంది. మరోవైపు, పెరిగిన పెట్టుబడులు, ఆధునిక తయారీ నైపుణ్యాల తీవ్రత కారణంగా తయారీ రంగ అభివృద్ధికి అవకాశాలనేవి తక్కువ ఆదాయాన్నిచ్చే ఆర్థిక వ్యవస్థల్లో తగ్గిపోయాయి.

వాతావరణమార్పులు మరింత తీవ్రమైన సవాళ్ళను విసురుతున్నాయి. ముఖ్యంగా ఈ తక్కువ ఆదాయ దేశాల్లో పరిస్థితి మరీ దారుణంగా వుంటోందని నివేదిక పేర్కొంది. అయితే కొత్తగా ఆవిర్భవించే ఈ ధోరణులు కొత్త అవకాశాలను కూడా తీసుకువస్తున్నాయని నివేదిక పేర్కొంది. ఉదాహరణకు, డిజిటలైజేషన్ ద్వారా వాణిజ్య వ్యయాలను వర్ధమాన దేశాలు తగ్గించుకోగలుగుతున్నాయి. సేవా నేతృత్వ వృద్ధివైపు అడుగులు వేస్తున్నాయి. లేదా అభివృద్ధిని సాధించేందుకు అంతర్జాతీయ హరిత పరివర్తనా క్రమంలో పునర్వినియోగ వనరుల డిమాండ్‌ను ఉపయోగించుకుంటున్నాయి.

30 ఏళ్ళ క్రితం డబ్ల్యుటిఒ ఏర్పడినప్పటి నుండి ఆర్థిక వ్యవస్థల మధ్య ఆదాయ అసమానతలు తగ్గించడంలో వాణిజ్యమనేది కీలక పాత్ర పోషిస్తుందని కూడా డబ్ల్యుటిఒ నివేదించింది. పేదరికాన్ని తగ్గించడంలో, భాగస్వామ్య సంక్షేమాన్ని సృష్టించడంలో వాణిజ్యం యొక్క పరివర్తనా పాత్రను పునరుద్ఘాటించడం ఈ నివేదిక నుండి దూరం జరిగే అంశమే అవగలదని డబ్ల్యుటిఓ డైరెక్టర్ జనరల్ ఎన్‌గోజి ఒకొంజో ఇవెలా, నివేదికకు తన ముందు మాటలో పేర్కొన్నారు.

అయితే, గత 30ఏళ్ళ సార్వజనీకరణ క్రమంలో వెనుకబడిన ప్రజల కోసం, ఆర్థిక వ్యవస్థల కోసం వాణిజ్యం, డబ్ల్యుటిఓ మరింత మెరుగ్గా పనిచేయగలిగేలా చేయడానికి మనం మరింత చేయాల్సి వుందన్నది రెండో అంశమని ఆమె పేర్కొన్నారు. 1996-2021 మధ్య జిడిపిలో అధిక వాణిజ్యం వాటాకు తక్కువ, మధ్య ఆదాయం కలిగిన ఆర్థిక వ్యవస్థల్లో శీఘ్రగతి అభివృద్ధికి మధ్య బలమైన సంబంధముందని నివేదిక పేర్కొంది. అధిక ఆదాయం కలిగిన దేశాల్లో తలసరి జిడిపిలో గల అంతరాన్ని తగ్గించడంలో కూడా దోహదపడిందని పేర్కొంది.

వృత్తిపరమైన శిక్షణ, నిరుద్యోగ భృతి, మరింత నైపుణ్యాలతో కూడిన కార్మిక వర్గం కోసం విద్య, తక్కువ ధరల వల్ల వినియోగదారులు లబ్ధికి హామీ కల్పిస్తూ పోటీ విధానం రూపొందించడం, అలాగే సమర్ధవంతమైన మౌలిక వసతుల కల్పన, ఆర్థిక మార్కెట్లు బాగా పనిచేసేలా చూడడం వంటి దేశీయ విధానాలు చేపట్టాల్సిన అవసరం వుందని డబ్ల్యుటిఒ నొక్కి చెప్పింది. వాణిజ్య వ్యయాలను తగ్గించాలని, డిజిటల్ అంతరాలను తగ్గించాలని కోరింది.

అంతర్జాతీయ సంస్థలు, సంఘాల మధ్య మరింత మెరుగైన సమన్వయం వుండాలని నివేదిక పిలుపిచ్చింది. వాణిజ్య విధానాలు, అనుబంధ విధానాల మధ్య అంతరాలను తగ్గించడానికి, పలు దేశాల ఆర్థిక వ్యవస్థల మధ్య, ఆలాగే దేశ ఆర్థిక వ్యవస్థలో అందరినీ కలుపుకుని పోవడాన్ని పెంచుకోవడానికి ఇది దోహదపడుతుందని పేర్కొంది.

బీమా కంపెనీల కొర్రీలు!

(మొదటి పేజీ తరువాయి)

ఆ కంపెనీ నిర్ధారించింది. కంపెనీ ఇస్తామన్న బీమా మొత్తం ఇంజన్ ఆయిల్ మార్చడానికి కూడా చాలదని ఆటో డ్రైవర్ వాపోయారు.

ఊర్మిళ నగర్‌కు చెందిన పి.ఉమామహేశ్వరరావు ఆటో రిపేరుకు కొనుగోలు చేసిన కంపెనీ రూ.25 వేలు వ్యయం అవుతుందని తేల్చింది. ఎస్‌బిఐ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు 10, 15 రోజుల్లో వాహనాన్ని పరిశీలిస్తారని, అప్పటి వరకు ఆటోను కంపెనీలోనే ఉంచాలని సూచించింది. విద్యార్థులను కాలేజీకి తీసుకెళ్లి తీసుకురావడానికి నెలవారీ కాంట్రాక్టు కుదుర్చుకున్న ఉమామహేశ్వరరావు అన్ని రోజులు వాహనాన్ని షెడ్‌లో ఉంచలేనని చెప్పడంతో ఎస్‌బిఐ ఇన్సూరెన్స్ కంపెనీ క్లయిమ్‌ను రూ.8 వేలకు కుదించి వేసింది. గత్యంతరం లేక ఈ మొత్తానికే అంగీకరించానని ఆయన వాపోయారు. వైఎస్ఆర్ జక్కంపూడి కాలనీకి చెందిన తన్నీరు పాపారావు లారీ నీటిలో పూర్తిగా మునిగిపోయింది. రూ.80 వేలు వాహన మరమ్మతులకు వ్యయం అవుతుందని కొటేషన్ తీసుకొచ్చారు. వరదలో ఉండగా వాహనాన్ని ఫొటో తీయలేదంటూ శ్రీరామ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు కొర్రీ వేయడంతో ఆయన తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. ఫెసిలిటేషన్ సెంటర్‌కు వాహన క్లయిమ్‌లకు వచ్చిన వారిలో ఎక్కువ మంది ఈ తరహా సమస్యలను ఎదుర్కొంటున్నారు. క్లయిమ్ చెల్లింపుపై ఎటువంటి స్పష్టతా ఇవ్వకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు.

సొంత ఖర్చులతోనే మరమ్మతులు

విజయవాడలో వరద ముంపు ప్రాంతాల్లో 1.51 లక్షల వరకు వాహనాలు ఉన్నాయని రవాణా శాఖ అంచనా వేసింది. అత్యధికంగా 1.14 లక్షల ద్విచక్ర వాహనాలు, 21 వేలకుపైగా కార్లు, 6,515 వరకు ఆటోలు, 515కుపైగా సరుకు రవాణా చేసే లారీలు, మధ్య తరహా వాహనాలు ఉన్నాయని అంచనా. సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్‌కు చెందిన చింతా రవితేజ రాపిడ్ సర్వీసు చేస్తారు. చేతిలో ద్విచక్ర వాహనం లేనిదే ఒక్కపూటా గడవదు. బీమా కంపెనీ ప్రతినిధులు పరిశీలించే వరకు వాహనాన్ని షెడ్‌లో ఉంచే పరిస్థితి లేదు. సుందరయ్య నగర్‌కు చెందిన శివగంగ ప్రసాద్ బీమా కంపెనీని సంప్రదించగా క్లయిమ్ వర్తించబోదని చెప్పారు. వాహనదారుల్లో ఎక్కువమంది ఇలాంటి సమస్యలనే ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సొంత ఖర్చులతో వాహనాలను మరమ్మతులు చేయించుకుంటున్నారు. మెకానిక్‌లు ఉపాధి పొందుతున్న విజయవాడ నవరంగ్ సెంటర్, సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్, పైపుల రోడ్డు సెంటర్ మెకానిక్ షాపులన్నీ మరమ్మతులకు వచ్చిన వేలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలతో నిండిపోయాయి.

మీ కోసం



ఉప్పు, బేకింగ్ సోడా సమపాళ్లల్లో తీసుకుని కొంచెం నీళ్లుకలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. దీనిలో ఒక క్లాత్ ముంచి గ్యాస్ స్టవ్ మొత్తం రుద్దాలి. కాసేపు అలా వదిలేసి, ఆరిన తర్వాత మంచి నీటితో శుభ్రం చేస్తే స్టవ్‌కి అంటుకున్న జిడ్డు, మురికి ఇట్టే వదులుతుంది.

జీవన సౌరభం

ఆవేశపరుడితో ఆలోచనలు, అసూయపరుడితో అభివృద్ధిని పంచుకోకూడదు.

వస్తువు విలువ



తోటపల్లి అనే ఊరిలో మహేష్, రమణ అనే ఇద్దరు స్నేహితులు ఉన్నారు. వాళ్లు ఏడవ తరగతి చదువుతున్నారు. రమణకి ఒక గుణం ఉంది. ఎవరిదగ్గరైనా ఏదైనా వస్తువు కనబడితే వారికి తెలియకుండా తీసుకుని దాచేవాడు.

ఒకరోజు స్కూలుకి మహేష్ కొత్త పెన్సిల్ తెచ్చుకున్నాడు. అది తనకివ్వమని రమణ అడిగాడు. మహేష్ ఇవ్వలేదు. మహేష్ ఇంటర్వెల్ కోసం బయటికి వెళ్ళినప్పుడు రమణ ఆ పెన్సిల్ తీసి దాచేశాడు. మహేష్‌కి రమణే తీసాడని నమ్మకం. అదే విషయం టీచర్‌కు చెప్పాడు.

'రమణా, మహేష్ పెన్సిల్ ఎందుకు తీసుకున్నావు' అడిగారు టీచర్.

'నేను తీయలేదు సర్' అమాయకంగా చెప్పాడు రమణ.

'సరే, ఎవరైనా తీస్తే మహేష్‌కి ఇవ్వండి' అన్నారు టీచర్.

ఆ తరువాతి రోజు రమణ స్కూలుకి కొత్త పెన్ను తెచ్చుకున్నాడు. తన స్నేహితునికి వస్తువుల విలువ తెలిసేలా చేయాలని మహేష్ ఆ పెన్ను తీసి దాచిపెట్టాడు. రమణ తరగతి గదిలోకి వచ్చి తన బ్యాగ్‌లో చూస్తే పెన్ను కనిపించలేదు. అందరినీ అడిగాడు. ఎవరూ తీయలేదని చెప్పారు.

రమణ ఆ రోజంతా చాలా బాధపడ్డాడు. మరుసటి రోజు మహేష్, ఆ పెన్ను మైదానంలో దొరికిందని రమణకి ఇచ్చాడు. రమణ ఎంతో సంతోషించాడు. తనకి వస్తువు విలువ తెలిసింది. అప్పటి నుండి ఎవరి వస్తువులూ తీయలేదు. ఎవరి వస్తువులైనా దొరికితే వెంటనే వారికి ఇస్తున్నాడు. రమణలో వచ్చిన మార్పు చూసి టీచర్ సంతోషించారు.



బొజ్జ అఖిల,
7వ తరగతి,
అనంత సాగర్ ఉన్నత పాఠశాల,
సిద్దిపేట జిల్లా.

తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.





నేను గీసిన బొమ్మ





జి.నీహారిక,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
పోతారెడ్డిపేట,
మం.అక్బర్ పేట-భూంపల్లి, జిల్లా: సిద్ధిపేట.


పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వరదలో ఇల్లు శుభ్రం ఇలా..

వాన వెలిసింది. వరద తెచ్చిన బురద మాత్రం ఇంకా వదల్లేదు. ముఖ్యంగా బుడమేరు వరదతో ఇళ్లల్లోకి చేరిన బురద వదిలించుకోవడానికి నానాకష్టాలు పడాల్సివస్తోంది. ఇంటి చుట్టూ మురుగు ఉంటేనే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెగ గాబరా పడిపోతాం. కానీ ఇప్పుడు ఇంట్లోకే మురుగు వచ్చింది. ఎంత శుభ్రం చేసినా చెడు వాసన పోవడం లేదు. ఈ సమయంలో ఇంటిని శుభ్రం చేసుకునేటప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలి.



ప్రస్తుతం ఇళ్లల్లోకి డ్రైనేజీ నీళ్లు వచ్చి చేరాయి. వీటిలో అనేక అనారోగ్య క్రిములు ఉంటాయి. కాబట్టి ఇంటిని శుభ్రం చేసుకునేటప్పుడు బ్లీచింగ్ పౌడర్ తప్పకుండా వాడాలి. ఇంకా హానిచేయని ఇతర క్రిమిసంహారక మందులు ఉపయోగించాలి.





చేతులకు, కాళ్లకు, ముక్కుకి రక్షణ కవచాలు ధరించాలి. ఎన్ 95 మాస్క్ ధరిస్తే ముక్కు, నోరు కప్పివుంచి కొంత రక్షణగా ఉంటుంది. అలాగే చేతులు, కాళ్లకి రక్షణగా రబ్బర్ గ్లౌజ్‌లు ధరించాలి.

ఇంటిని శుభ్రం చేసుకున్నాక, ఒక రోజంతా అలాగే వదిలేయాలి. రెండో రోజుకి కూడా తేమగా ఉంటే మరోసారి శుభ్రం చేసుకోవాలి.

ఫ్యాను గాలి ఇంట్లో నుండి బయటికి వెళ్లేలా బయటి గాలి ఇంట్లోకి వచ్చేలా ఏర్పాటు చేసుకోవాలి. కరెంటు సౌకర్యం ఇంకా పునరుద్ధరించుకోనట్లైతే కనీసం తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలి.

జనరేటర్ సౌకర్యం ఉన్నవాళ్లు ఇంటి నుండి కనీసం 20 అడుగుల దూరంలో వుంచి ఉపయోగించుకోవాలి.

ఇంట్లో తేమ పోయేలా, ఒకటికి పదిసార్లు తేమ టెస్టర్‌ని ఉపయోగించాలి. బయట దుకాణాల్లో ఇవి దొరుకుతాయి. ఇవి లభ్యం కానప్పుడు కాటన్ వస్త్రంతో తడి పీల్చుకునే వరకు తుడవాలి.

దుస్తులు, వంట సామాను, ఫర్నీచర్, చెప్పులు వంటివి శుభ్రం చేసేటప్పుడు నీళ్లల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. ఒకటికి పది సార్లు శుభ్రంగా కడగాలి.

ఇంటికి, వస్తువులకు బీమా సౌకర్యం ఉంటే శుభ్రం చేయకముందు వాటిని ఫొటో తీసుకోవడం అస్సలు మర్చిపోవద్దు.

వరద వచ్చి వారం రోజులుగా ఇళ్లల్లో వస్తువులన్నీ నీళ్లల్లో నానిపోయాయి. పరుపులు, దిండ్లు, బట్టలు వంటివి 24 గంటల కంటే ఎక్కువసేపు నీళ్లల్లో నానితే వాటిని ఉపయోగించకూడదు. కాబట్టి భారంగా అనిపించినా గృహోపకరణాలు, తివాచీలు వంటి ఖరీదైన వస్తువులైనా సరే పారవేయడం మంచిది.

శుభ్రం చేసుకున్నాక క్లాత్ ఫ్లోర్ పొడిగానే ఉందని, మళ్లీ ఉపయోగించవద్దు. అందులో కంటికి కనిపించని క్రిములు చేరి ఉండవచ్చు. కాబట్టి దాన్ని ఉపయోగించకుండా కొత్తది వాడాలి.

నీటిలో తడిసిపోయిన ఎలక్ట్రిక్ వస్తువులను వాడకపోవడమే మంచిది. ఎలక్ట్రిక్ కుక్కర్, ఐరన్ బాక్స్, ఓవెన్ అస్సలు వాడవద్దు.

కూలర్, ఫ్రిజ్, ఏసీ మరమ్మతు తరవాత, ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోని వాడాలి.

బీరువా, కుర్చీలాంటి ఇనుప వస్తువులను శుభ్రం చేసుకున్నా, కలర్ కోటింగ్ ఇచ్చిన తరువాతే వాడాలి.

ఇంట్లో చెత్తను పారవేసేటప్పుడు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. పదునైన వస్తువులు, పురుగులు లాంటివి బురదలో చిక్కుకుపోయి ఉంటాయి. కాబట్టి ఒకసారి దాన్ని క్షుణ్ణంగా పరిశీలించుకుని సంచుల్లోకి ఎత్తి బయట పారవేయాలి.

కాలనీ అంతా ఒకేసారి ఇల్లు శుభ్రం చేసుకుంటారు కాబట్టి పోగైన చెత్తను తీసుకెళ్లేలా అధికారులతో ముందుగానే మాట్లాడాలి.

ఎంత శుభ్రం చేసుకున్నా ఇల్లు మొత్తం సిద్ధమవ్వాలంటే వారం నుండి పది రోజులు పట్టవచ్చు. ముందుగానే దీనికి సిద్ధంగా ఉండాలి.

రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లలు, పెద్దలను సాధ్యమైనంత వరకు ఇంటికి దూరంగా ఉంచి, శుభ్రం చేసుకోవాలి.



మరమరాలతో ఎన్ని ప్రయోజనాలో..

పిల్లలు, పెద్దలు కాలక్షేపంగా తినే పదార్థాలు మరమరాలు. వీటిని బొరుగులు, ముర్మర్లు, మురీలు అంటూ వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలుగా పిలుస్తారు. బియ్యానికి అధిక పీడనాన్ని అందిస్తే ఇవి తయారవుతాయి. అందుకే వీటిని పఫ్డ్ రైస్ అంటారు. వరి అన్నంతో సరిసమానంగా అన్ని పోషక విలువలు బొరుగుల్లోనూ ఉన్నాయి. మరమరాలతో స్వీట్లు, పాయసం, టిఫిన్లు చేసుకోవచ్చు. ఇవి తినేవరకు తేలిగ్గానే అనిపించినా పొట్ట నిండుతుంది.

- మరమరాలు చాలా తేలికపైన ఆహారం. తక్కువ కేలరీలుంటాయి. శరీరంలో పేరుకుపోయిన కొవ్వును కరిగించేందుకు ఇవి సహాయపడుతాయి. 100 గ్రాముల మరమరాలు తీసుకుంటే 17 గ్రాముల ఫైబర్ అందుతుంది. దీనివల్ల పొట్ట ఆరోగ్యంగా ఉంటుంది. మరమరాలతో తయారైన ఆహారపదార్థాలు చాలా తేలిగ్గా అరగడంతో పాటు జీర్ణవ్యవస్థకు మేలు చేస్తాయి.
- వీటిలో విటమిన్ డి, బిలతో పాటు క్యాల్షియం, ఐరన్ శాతం కూడా ఎక్కువే. ఈ పోషకాలన్నీ ఎముకలు, దంతాల దృఢత్వానికి బాగా ఉపయోగపడతాయి.
- అధిక రక్తపోటు, గుండెపోటు, స్ట్రోక్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడే వాళ్లు తరచూ మరమరాలను తీసుకోవడం వల్ల వాటి నుంచి దూరంగా ఉండొచ్చు. సోడియం తక్కువగా ఉండే మరమరాలను నిత్యం తీసుకుంటే రక్తపోటు స్థిరంగా ఉంటుంది. గుండె పనితీరు మెరుగ్గా ఉంటుంది.
- మరమరాల్లో కార్బోహైడ్రేట్స్ ఎక్కువైనా, కాసిని తిన్నా కావలసిన శక్తి సమకూరుతుంది. కాబట్టి ఆహారం మితంగా తీసుకోవాలనుకునే డయాబెటీస్ వ్యాధిగ్రస్తులకూ మరమరాలు మంచివే.
- మరమరాల్లో ఉండే పోషక విలువలు పిల్లల ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడతాయి. మెదడుకు చురుకుదనాన్ని కలిగిస్తాయి. మరమరాలతో పాయసం, లడ్డూ, ఛాట్ వంటివి చేస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- పిల్లల్లో రక్తహీనత సమస్య సాధారణంగా కనిపిస్తుంటుంది. అలాంటి వారి డైట్‌లో మరమరాలను చేర్చడం ఎంతో ఉత్తమం. మరమరాల్లో ఐరన్ కంటెంట్ పుష్కలంగా ఉంటుంది. వీటిని పిల్లలకు క్రమంతప్పకుండా ఇస్తే రక్తవృద్ధి జరుగుతుంది.
- పిల్లలు రోజంతా యాక్టివ్‌గా, ఉండాలంటే ప్రోటీన్లు చాలా అవసరం. మరమరాల్లో ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి. బ్రేక్‌ఫాస్ట్‌లో పిల్లలకు మరమరాలతో చేసిన స్నాక్స్ ఇస్తే నీరసం, అలసట వంటి సమస్యలు దూరమై శక్తివంతంగా ఉంటారు.



వరద బాధితులకు తమిళ నటుడు


శింబు రూ.6 లక్షల విరాళం

తెలుగు రాష్ట్రాల్లో సంభవించిన వరదల కారణంగా ప్రభావితమైన బాధితులకు తాజాగా తమిళ హీరో శింబు రెండు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్స్‌కి భారీ విరాళం ఇచ్చారు. మూడు లక్షల చొప్పున మొత్తం ఆరు లక్షల రూపాయలను ఆయన విరాళంగా ప్రకటించారు.

'దేవర' ట్రైలర్ విడుదల



ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు పార్ట్‌లుగా ఈ చిత్రాన్ని కొరటాల శివ తెరకెక్కిస్తున్నారు. తాజాగా మంగళవారం ఈ చిత్రం నుండి చిత్రబృందం ట్రైలర్ విడుదల చేసింది. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమాను నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ చిత్రంలో మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో అలరించబోతున్నారు. సెప్టెంబర్ 27న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది.



బంద్ బాటలో కోలీవుడ్ నిర్మాతల మండలి

నటీనటుల పారితోషికాలు, ఓటీటీ, శాటిలైట్ రైట్స్ తదితర సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న లక్ష్యంతో నవంబరు ఒకటో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సినిమా షూటింగులను నిలిపివేయాలని కోలీవుడ్ నిర్మాతల మండలి ఓ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంపై పున:పరిశీలన చేయాలని తాజాగా నడిగర్ సంఘం ఓ విజ్ఞప్తి చేసింది. నడిగర్ సంఘం ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, నిర్మాతల సంఘం అధ్యక్షుడు తేనాండల్ మురళి రామస్వామి సారథ్యంలో నిర్వాహకుల కమిటీ సమావేశం ఇటీవల నిర్వహించారు. ఈ సమావేశంలో నటీనటులు – నిర్మాతల మధ్య జరిగిన 11 అవగాహన ఒప్పంద పత్రాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకుని, వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా ధనుష్ వంటి పలువురు హీరోల వల్ల నిర్మాతలు ఎదుర్కొంటున్న సమస్యతో పాటు ఇతర అంశాలను కూడా నిర్మాతల మండలి మరోమారు నడిగర్ సంఘం దృష్టికి తీసుకెళ్ళింది.

చాలాకాలం తర్వాత..



'మనసంతా నువ్వే', 'ఆట', 'బాస్', 'నేనున్నాను' వంటి పలు సూపర్ హిట్ చిత్రాలను అందించిన డైరెక్టర్ వీఎన్ ఆదిత్య, లాంగ్ గ్యాప్ తర్వాత ఓ కొత్త చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాను ఓ.ఎం. జీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై, 'ఏయు అండ్ ఐ' సమర్పణలో డాక్టర్ మీనాక్షి అనిపిండి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కేథరీన్ ట్రెసా కీలక పాత్రలో నటిస్తున్నారు. మంగళవారం కేథరీన్ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో అమెరికన్స్, స్పానిష్ పీపుల్, ఆఫ్రికన్స్, యూరోపియన్స్, ఏషియన్స్, తమిళ్, కన్నడ, తెలుగు ఆర్టిస్టులు కీలక పాత్రల్లో నటించనున్నారు. ఈ సినిమాని యూఎస్‌లోని డల్లాస్‌లో చిత్రీకరిస్తారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. త్వరలో ఈ థ్రిల్లర్ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు.



'సికందర్'లో కాజల్

సల్మాన్ ఖాన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ 'సికందర్'. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 2025లో థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందన్న సంగతి ఇదివరకే ప్రకటించారు. తాజాగా ఈ సినిమాలో మరో నటి కూడా నటిస్తున్నట్లు చిత్రబృందం పేర్కొంది. సికిందర్ టీంలోకి కాజల్‌కు స్వాగతం పలుకుతూ.. ఆమె సెట్స్‌లో జాయిన్ అయిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా చిత్రబృందం తెలియజేసింది.

పారా ఒలింపిక్స్

పతక విజేతలకు నజరానా

- ప్రోత్సాహక చెక్కులు అందజేత
- కేంద్ర క్రీడలమంత్రి మాండవీయ



న్యూఢిల్లీ: పారా ఒలింపిక్స్ పతకాలు సాధించిన భారత అథ్లెట్లపై కాసుల వర్షం కురుస్తోంది. అసమాన పోరాటంతో పతకాల పంట పండించిన యోధులకు భారీ ప్రైజ్‌మనీ అందుకున్నారు. న్యూఢిల్లీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చెక్కులను అందజేశారు. పారా ఒలింపిక్స్ క్రీడలు ముగియడంతో క్రీడల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పారా ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన అథ్లెట్లకు రూ.75లక్షల నగదు చెక్కులను అందుకున్నారు. అలాగే రజత పతక విజేతలకు రూ.50లక్షలు, కాంస్య పతక విజేతలకు రూ.30 లక్షలు చొప్పున అందుకున్నారు. అలాగే ఆర్చరీ మిక్స్‌డ్ విభాగంలో పతకం సాధించిన శీతల్ దేవికి రూ.22.5లక్షలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. 2024 పారిస్ పారా ఒలింపిక్స్‌లో సాధించిన రికార్డు పతకాలను 2028 లాస్ ఏంజెల్స్‌లో బ్రద్దలు కొట్టాలని ఆయన ఆకాంక్షించారు. పారా ఒలింపిక్స్‌లో భారత్ పతకాల సాధనలో దూసుకెళ్తోందని, 2016లో కేవలం 4 పతకాలకే పరిమితమైన భారత్.. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో 19కు పెరిగినా.. 2024 పారిస్ పారా ఒలింపిక్స్‌లో ఏకంగా 29పతకాలతో 18వ స్థానంలో గర్వకారణమని కొనియాడారు. రాబోయే పారా ఒలింపిక్స్‌లో భారత్ 50పతకాల మార్క్‌ను అధిగమించడం ఖాయమని ఆయన తెలిపారు. పారిస్ పారా ఒలింపిక్స్‌లో భారత్ 7స్వర్ణ, 9రజత, 13కాంస్యాలతో సహా 29 పతకాలతో చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. 2024 పారా ఒలింపిక్స్ ముగియడంతో భారత అథ్లెట్లందరూ మంగళవారం తిరిగి రాగా.. వారికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది.

ఇండియా-ఎ కెప్టెన్‌గా మయాంక్


పంత్ స్థానంలో రింకూ



బెంగళూరు : దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ రేపటినుంచి ప్రారంభం కానుంది. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టుకు ఎంపికైన ఆటగాళ్లు మినహా.. మిగిలిన ఆటగాళ్లంతా దులీప్ ట్రోఫీ బరిలోకి దిగనున్నారు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్, వికెట్ కీపర్ రిషభ్ పంత్‌లతో పలువురు ఆటగాళ్లకు బిసిసిఐ బ్రేక్ ఇచ్చింది. మంగళవారం బీసీసీఐ దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ కోసం ఆటగాళ్ల లిస్ట్‌ను ప్రకటించింది. ఇండియా–బి తరఫున ఫినిషర్ రింకూ సింగ్ ఆడనున్నాడు. ఓపెనర్ మయంక్ అగర్వాల్ ఇండియా–ఏ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సెప్టెంబర్ 12 నుంచి దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ జరుగనుంది. ఈసారి ఇండియా–బి తరఫున పంత్ స్థానంలో రింకు సింగ్ బరిలోకి దిగనున్నాడు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ స్థానంలో సుయాశ్ ప్రభుదేశాయ్ ఆడనున్నాడు. ఇండియా–ఏ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ నుంచి మయాంక్ అగర్వాల్ పగ్గాలు అందుకోనున్నాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు స్క్వాడ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, కుల్దీప్ యాదవ్, అకాశ్ దీప్, అక్షర్ పటేల్‌లు సైతం దులీప్ ట్రోఫీ రెండో రౌండ్‌లో ఆడడం లేదు. తొలి రౌండ్‌లో ఇండియా–ఏపై ఇండియా–బి, ఇండియా–డిపై ఇండియా–సి విజయం సాధించిన సంగతి తెలిసిందే.

ఇంగ్లండ్ టి20 కెప్టెన్‌గా సాల్ట్

ఆస్ట్రేలియాతో సిరీస్‌కు జట్టు ప్రకటన • నేడు తొలి టి20



లండన్: ఆస్ట్రేలియాతో జరిగే మూడు టి20ల సిరీస్‌కు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఇసిబి) ప్రకటించిన జట్టులో ముగ్గురు కొత్త కుర్రాళ్లు చోటు దక్కించుకున్నారు. ఇసిబి మంగళవారం ప్రకటించిన జట్టులో జోర్డాన్ కాక్స్, జాకబ్ బెథెల్, జేమీ ఓవర్టన్‌లకు చోటు దక్కింది. ఆస్ట్రేలియాతో జరిగే సిరీస్‌కు గాయపడ్డ కెప్టెన్ జోస్ బట్లర్ స్థానంలో ఫిల్ సాల్ట్ సారథ్యం వహించనున్నాడు. బుధవారం నుంచి ఇరుజట్ల మధ్య మూడు టి20ల సిరీస్ ప్రారంభం కానుంది. ఇంగ్లండ్ పర్యటకు ఆస్ట్రేలియా జట్టు విచ్చేయగా.. 13, 15న రెండు, మూడు టి20లు జరగనున్నాయి.

జట్టు: ఫిల్ సాల్ట్(కెప్టెన్), జాక్, జోర్డాన్ కాక్స్, లివింగ్‌స్టోన్, బెత్‌హెల్, సామ్ కర్రన్, ఓవర్టన్, ఆర్చర్, రషీద్, మహమూద్, టోప్లే.

అన్వర్ అలీపై నాలుగు నెలల నిషేధం



కోల్‌కతా: భారత ఫుట్‌బాల్ ఆటగాడు అన్వర్ అలీపై వేటు పడింది. ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్(ఎఐఎఫ్‌ఎఫ్) మంగళవారం నాలుగు నెలల నిషేధాన్ని విధించింది. భారత జట్టు డిఫెండర్ అయిన అన్వర్ అలీ.. ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సి, మోహన్ బగాన్ సూపర్ జెయింట్‌తో ఒప్పందానికి ప్రయత్నించాడు. ఢిల్లీ ఎఫ్‌సి ఆటగాడయిన అన్వర్.. ఆ క్లబ్ తరఫున ఒప్పందాన్ని రద్దు చేసుకోకుండానే ఈ వ్యవహారం నడపడంతో అతనిపై ఎఐఎఫ్ఎఫ్ ప్లేయర్ స్టేటస్ కమిటీ నిషేధాన్ని విధించింది. దీంతో అతడు ఢిల్లీ ఎఫ్‌సి నుంచి అందుకోనున్న రూ.12.9కోట్ల నగదుకు మూడోవంతు వదులుకోవాల్సి ఉంటుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68